తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org


ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం
సూర్యపేట
యాద్రాద్రి భువనగిరి

బుధవారం
05 ఆగష్టు 2026

పేజీలు : 8




# గంజాయి మత్తులో యువత

❑ యాదాద్రి భువనగిరి జిల్లాలో పెరుగుతున్న గంజాయి కేసులు ❑ పోలీసుల వరుస దాడులు.. అయినా ఆగని మత్తు దందా

❑ఒకే నెలల్లో 15కుపైగా కేసులు నమోదు ❑కిలోల కొద్ది గంజాయి స్వాధీనం ❑ అంతర్రాష్ట్ర ముఠాలే ప్రధాన నిందితులు

**బీబీనగర్ (జనంసాక్షి):** యాదాద్రి భువనగిరి జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం రోజురోజుకూ పెరుగుతున్నాయి. పోలీసులు వరుసగా దాడులు నిర్వహిస్తూ నిందితులను అరెస్ట్ చేస్తున్నప్పటికీ మత్తు దందా మాత్రం ఆగడం లేదు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి గంజాయి జిల్లాకు చేరు తుండటం తో యువత, విద్యార్థులు లక్ష్యంగా ఈ ముఠాల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది ప్రారంభం నుంచి గంజాయి కేసులు వరుసగా నమోదవుతున్నాయి. భువనగిరి, చౌటుప్పల్, తుర్కపల్లి, రామన్న పేట, మోత్కూండూరు, వలిగొండ, యాదగిరిగుట్ట, బీబీనగర్ తదితర ప్రాంతాల్లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో భారీ మొత్తంలో

మిగతా 2లో

# ఒకటి 'అభివృద్ధి' నిలయం.. మరొకటి 'సమస్యల' వలయం.!

❍ఒకవైపు సుందరీకరణ.. ❍మరొకవైపు నిర్లక్ష్యం..

❍గత 5 సంవత్సరాలుగా.. వస్తున్న ఆనవాయితీ మారదా...

❍చండూరు మున్సిపాలిటీలో వార్డుల మధ్య రాజకీయ పక్షపాత' పనుల పర్వం..

❍మున్సిపాలిటీ అంటే కొన్ని ప్రాంతాల సమూహం కాదు.

❍పట్టణమంతా ఒకే కుటుంబం అని పాలకులు గుర్తించాలి.. అంటున్న ప్రజలు

❍మేము పన్నులు కడుతున్నాం... మాకూ సమాన సౌకర్యాలు పొందే హక్కు ఉంది

❍సమాన దృష్టితో చూడాలని కోరుతున్న మున్సిపల్ ప్రజలు..

**చండూరు, ఆగస్టు 4 (జనంసాక్షి)**
పట్టణాల రూపురేఖలు మార్చాలని, ప్రతి పౌరుడికీ కనీస మౌలిక వసతులు కల్పించాలని మేజర్ గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేస్తే... చండూరు మున్సిపాలిటీలో మాత్రం అభివృద్ధికీ సరిహద్దులు గీస్తున్నారు. పట్టణంలోని 10 వార్డుల ప్రజలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన పాలకవర్గం, అధికారులు కొన్ని వార్డులకే ప్రాధాన్యత ఇస్తూ.. మరికొన్ని వార్డులను విస్మరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణంలో స్పష్టంగా కనిపిస్తున్న ఈ తారతమ్యాలు ప్రస్తుతం మున్సిపాలిటీలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పట్టణ అభివృద్ధికి వచ్చే నిధులను ప్రతి వార్డు జనాభా, అవసరాల

మిగతా 2లో




# గ్రామపంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ?

❑ ఇద్దరు అధికార పార్టీ నాయకుల పాత్రపై అనుమానాలు..

❑ భూ దందాల తర్వాత ఇప్పుడు నకిలీ పత్రాల వ్యవహారమా?

❑ ఒక్కరిపైనే కేసు నమోదు... అసలు సూత్రధారులు ఎవరు?

❑ సహకరించిన వారందరిపైనా దర్యాప్తు జరపాలని డిమాండ్




**మర్రిగూడ, ఆగస్టు 3 (జనం సాక్షి)**
నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం ఖుదాబక్ష్‌పల్లి గ్రామంలో ప్రభుత్వ భూమికి సంబంధించిన వ్యవహారం మరోసారి సంచలనంగా మారింది. 188 గజాల ప్రభుత్వ భూమికి సంబంధించి గ్రామపంచాయతీ కార్యదర్శి సంతకాన్ని నకిలీగా రూపొందించి ధృవీకరణ పత్రం, రిజిస్టర్ జర్నల్ వంటి అధికారిక పత్రాలు తయారు చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు మర్రిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో బొంత మల్లేష్‌పై కేసు నమోదు చేసినప్పటికీ, ఫోర్జరీ సంతకాలను అసలు ఎవరు చేశారు? ఈ నకిలీ పత్రాల తయారీ వెనుక ఇంకెవరి పాత్ర ఉంది? అనే ప్రశ్నలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీశాయి.

పోలీసుల కేసు నమోదు అనంతరం ఇప్పుడు దర్యాప్తు ఒక్క వ్యక్తికే పరిమితం కాకుండా, ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంబంధం ఉన్న ప్రతి ఒక్కరి పాత్రను వెలికితీయాలని గ్రామస్థులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నకిలీ పత్రాలు సిద్ధం చేయడం, వాటిని వినియోగించడం, వాటి ద్వారా ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించడం వంటి అంశాల్లో ఎవరెవరు భాగస్వాములయ్యారనే కోణంలో కూడా విచారణ జరగాలని కోరుతున్నారు.

స్థానికంగా ఇద్దరు అధికార పార్టీ నాయకుల పేర్లు ఈ వ్యవహారంలో చర్చకు వస్తుండటంతో, వారి పాత్రపై కూడా నిష్పాక్షిక విచారణ జరపాలనే డిమాండ్ వినిపిస్తోంది. అయితే ఇప్పటివరకు వారి పాత్రపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. దర్యాప్తులో ఆధారాలు లభిస్తేనే బాధ్యతలు నిర్ధారించాలని న్యాయవర్గాలు సూచిస్తున్నాయి.

ఇప్పటికే భూ వివాదాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణల ఆరోపణలు, అక్రమ కేసుల వివాదాలతో వార్తల్లో నిలిచిన కొందరు నాయకుల పేర్లు ఇప్పుడు ఈ ఫోర్జరీ వ్యవహారంలోనూ వినిపించడం స్థానికుల్లో అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ అధికారిక పత్రాలపై నకిలీ సంతకాలు చేయడం వంటి ఆరోపణలు నిజమైతే అది ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే తీవ్రమైన విషయం అవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఈ కేసులో పోలీసులు ఒక్కరిపై మాత్రమే కేసు నమోదు చేయడంతో, అసలు ఫోర్జరీకి పాల్పడిన వ్యక్తులు, పత్రాలను సిద్ధం చేసిన వారు, వాటిని ఉపయోగించిన వారు, లబ్ధి పొందేందుకు ప్రయత్నించిన వారు ఎవరైనా ఉంటే వారందరినీ గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సాక్షుల పాత్ర, పత్రాల తయారీ ప్రక్రియ, సంబంధిత అధికార కార్యాలయాల్లో వాటి వినియోగం వంటి అంశాలపై కూడా లోతైన దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

చట్టం ముందు అందరూ సమానమేనని, రాజకీయ హోదా, అధికార ప్రభావం లేదా ఇతర ఒత్తిళ్లకు తావు ఇవ్వకుండా ఈ కేసులో పాత్ర ఉన్న ప్రతి ఒక్కరిపై సమగ్ర విచారణ నిర్వహించాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఫోర్జరీ వంటి తీవ్రమైన ఆరోపణల్లో నేరానికి పాల్పడిన వారితో పాటు, సహకరించిన వారు, ప్రోత్సహించిన వారు, అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించిన వారిపైనా ఆధారాలు లభిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## బ్లాక్ మనీ పేరుతో రూ.13 లక్షలు మోసం చేసిన నిందితుడు అరెస్ట్ ?

### మోసానికి ఉపయోగించిన బ్లాక్ పేపర్లు,రసాయన ద్రావణాలు స్వాధీనం



**అశ్వారావుపేట ఆగస్టు 4 (జనంసాక్షి):** అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో బ్లాక్ మనీ పేరుతో అమాయకులను మోసం చేస్తున్న పత్తిపాటి ప్రేమ్ చందు అనే నిందితుడిని అశ్వారావుపేట పోలీసులు అరెస్ట్ చేశారు.బ్లాక్ పేపర్లను ప్రత్యేక రసాయన ద్రావణంలో ముంచితే రూ.500 నోట్లుగా మారుతాయని నమ్మించి, రూ.11 లక్షలు తీసుకున్నట్లు, అనంతరం రసాయనాల కొనుగోలు పేరుతో మరో రూ.2 లక్షలు తీసుకుని మొత్తం రూ.13 లక్షలు అశ్వారావుపేట కు చెందిన మదుబాబు ను మోసం చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడు గతంలో కూడా నకిలీ కరెన్సీ,మోటార్ సైకిళ్ళ దొంగతనం,ఇతర కేసుల్లో బాచుపల్లి, రామచంద్రపురం,కూకటపల్లి పోలీస్ స్టేషన్లలో నిందితుడిగా ఉండి జైలుకు వెళ్లి వచ్చినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడి వద్ద నుండి మోసానికి ఉపయోగించిన వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.రూ.500 నోట్ల పరిమాణంలో కట్ చేసిన 20,000 బ్లాక్ పేపర్లు (20 కట్టలు)బ్లాక్ పేపర్లను నోట్లుగా మారుస్తామని చెప్పేందుకు ఉపయోగించిన రెండు రసాయన ద్రావణాల సీసాలు నిందితుడిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి, స్వాధీనం చేసుకున్న వస్తువులను సీజ్ చేసి,అరెస్ట్ చేయడం జరిగిందని,బ్లాక్ మనీ,నకిలీ నోట్లు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని చెప్పే వ్యక్తులను నమ్మవద్దు అని ఇటువంటి మోసాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలపై వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ ఎయిత్ రాజు తెలిపారు.

# ఒక్కరిపైనే కేసు నమోదు.. అసలు సూత్రధారులు ఎవరు?

- కబ్జాలు, బెదిరింపులు, అక్రమ కేసులు,భూ దందాల తర్వాత ఇప్పుడు నకిలీ పత్రాల వ్యవహారమా?
- 2013లో మర్రిగూడ ఎమ్మార్వో కార్యాలయంలో నమోదైన ఫోర్జరీ కేసు?
- సార్ పేరు వాడుకుంటూ మండలాన్ని భ్రష్టు పట్టిస్తున్న నాయకులు
- ఇలాంటి నాయకులకు పదవులు ఎలా ఇస్తారు?
- చేసేది అక్రమాలు.. ప్రశ్నిస్తే అక్రమ కేసులు కుట్రలు? ఇదేనా మీ సారు నేర్పిన సమస్కారం మా..




**మర్రిగూడ, ఆగస్టు 3 (జనంసాక్షి)**
నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం ఖుదాబక్ష్‌పల్లి గ్రామంలో 188 గజాల ప్రభుత్వ భూమికి సంబంధించిన వ్యవహారం మరోసారి వివాదానికి కేంద్రంగా మారింది. గ్రామపంచాయతీ కార్యదర్శి సంతకాన్ని నకిలీగా రూపొందించి ధృవీకరణ పత్రం, రిజిస్టర్ జర్నల్ వంటి అధికారిక పత్రాలు తయారు చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు మర్రిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో బొంత మల్లేష్‌పై కేసు నమోదైనప్పటికీ, ఫోర్జరీ పత్రాలను అసలు ఎవరు రూపొందించారు? వాటి వెనుక ఇంకెవరి పాత్ర ఉంది? అనే ప్రశ్నలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి.
గ్రామస్థుల వాదన ప్రకారం, కేసు నమోదైన వ్యక్తికి తన పేరు కూడా సరిగా రాయడం రాదని, తన సంతకాన్ని కూడా స్వయంగా చేయలేడని చెబుతున్నారు. అలాంటప్పుడు అధికారిక పత్రాలపై కనిపిస్తున్న సంతకాలు, రాతలు, ధృవీకరణ పత్రాలను ఎవరు సిద్ధం చేశారు? ఈ వ్యవహారం వెనుక మరెవరైనా ఉన్నారా? అనే కోణంలో కూడా దర్యాప్తు జరపాలని వారు కోరుతున్నారు.
స్థానికంగా ఇద్దరు అధికార పార్టీ నాయకుల పేర్లు కూడా ఈ వ్యవహారంలో వినిపిస్తున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అయితే వారి ప్రమేయంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. ఈ అంశంపై ఆధారాలు లభిస్తేనే బాధ్యతలు నిర్ధారించాల్సి ఉంటుందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.
గ్రామస్థుల కథనం ప్రకారం, 2013లో మర్రిగూడ ఎమ్మార్వో కార్యాలయంలో నమోదైన ఫోర్జరీ కేసులో కూడా ఇదే నాయకుడి పేరు వినిపించిందని చెబుతున్నారు. అలాగే గతంలో భూ వివాదాలు, బెదిరింపులు, తప్పుడు కేసుల ఆరోపణలు కూడా వెలుగులోకి వచ్చాయని పేర్కొంటున్నారు. ఈ ఆరోపణలపై తుది నిర్ణయం మాత్రం సంబంధిత దర్యాప్తు, న్యాయ ప్రక్రియల ద్వారానే తేలాల్సి ఉంది. ఈ కేసులో ఒక్కరిపైనే కేసు నమోదు చేయడం సరిపోదని, ఫోర్జరీ పత్రాలను తయారు చేసిన వారు, వాటిని వినియోగించిన వారు, సహకరించిన వారు, అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించిన వారు ఎవరైనా ఉంటే వారందరినీ గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే గతంలో కూడా ఇలాంటి నకిలీ ధృవీకరణ పత్రాలు తయారయ్యాయా? వాటి ఆధారంగా ప్రభుత్వ భూములు లేదా ఇతర ఆస్తులకు సంబంధించిన లావాదేవీలు జరిగాయా? అనే కోణంలోనూ సమగ్ర విచారణ జరపాలని ప్రజాసంఘాలు కోరుతున్నాయి.




## ఒకటి 'అభివృద్ధి' నిలయం..
## మరొకటి 'సమస్యల' వలయం..!

ప్రాతిపదికన కేటాయించాల్సి ఉంటుంది. కానీ చందూరులో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందనే విమర్శలు ఉన్నాయి. పాలకవర్గంలో కీలకమైన నేతలు లేదా అధికార యంత్రాంగం దయాదాక్షిణ్యాలు ఉన్న వార్డులలో సీసీ రోడ్లు అద్దాల్లా మెరిసిపోతుంటే... ప్రతిపక్షాల వార్డులు, సరిహద్దు ప్రాంతాల పరిస్థితి మాత్రం దయనీయంగా మారింది. వార్డుల్లో రాళ్లు తేలిన రోడ్లు, అసంపూర్తిగా మిగిలిన డ్రైనేజీలతో జనం నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.

**వర్షాకాలం వస్తే నరకప్రాయం.!**
పక్షపాత వైఖరికి నిదర్శనంగా కొన్ని వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థలు పూర్తిగా అస్తవ్యస్తంగా తయారయ్యాయి.కొన్ని వీధుల్లో కనీసం కాలువల తవ్వకం కూడా సరిగ్గా జరగలేదు. మురుగు నీరు నిలిచిపోయి దోమల వ్యాప్తి, దుర్గంధంతో ప్రజలు నివసించలేని పరిస్థితి దాపురించింది. వర్షం వస్తే చాలు, రోడ్లు-కాలువలు ఒకటై మోకాళ్ల లోతు నీటిలో నడవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు."మేమూ పన్నులు కడుతున్నాం... మాకూ సమాన సౌకర్యాలు పొందే హక్కు ఉంది" అని వెనుకబడిన వార్డుల ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ అంటే కొన్ని ప్రాంతాల సమూహం కాదు, పట్టణమంతా ఒకే కుటుంబం అని పాలకులు గుర్తించాలని వారు కోరుతున్నారు.అధికారులు, ప్రజాప్రతినిధులు ఇకనైనా క్షేత్రస్థాయిలో పర్యటించి, వార్డుల మధ్య వ్యత్యాసాలను నివారించి, అన్ని వార్డుల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ పనులను యుద్ధప్రాతిపదికన, నాణ్యతతో పూర్తి చేయాలని చందూరు పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## గంజాయి మత్తులో యువత

గంజాయిని స్వాధీనం చేసుకుని పలువురిని అరెస్ట్ చేశారు.
జూలై ఒకే నెలలో పోలీసులకు పట్టుబడ్డ గంజాయి కేసులలో భువనగిరి పరిధిలో 50 గ్రాముల డ్రై గంజా, 225 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని తొమ్మిది మందిపై నాలుగు కేసులు నమోదు చేశారు. చౌటుప్పల్‌లో కంపెనీలో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కూలీల వద్ద నుంచి గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. తుర్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కర్ణాటక నుంచి గంజాయి తెచ్చిన ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి నుండి 250 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకోగా , ఆలేరు పరిధిలో 150 గ్రాముల డ్రై గంజాయి, రామన్నపేటలో వాహన తనిఖీల్లో 120 కిలోల గంజాయి, తుర్కపల్లి మండలం మాదాపూర్ శివారులో 200 గ్రాముల గంజాయి, ఒక బైక్, నాలుగు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫిబ్రవరిలో మోత్కొండూరు?గుండాల ప్రాంతాలకు చెందిన ఇద్దరి కారులో 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు.జనవరి 2026 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 24 గంజాయి కేసులు నమోదు కాగా, 61 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. మొత్తం 446 కిలోలకుపైగా గంజాయి, 50 గ్రాముల డ్రై గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాల కదలికలపై పోలీసు విభాగం ప్రత్యేక నిఘా పెట్టింది పోలీస్ దాడుల్లో అత్యధికంగా వలస కార్మికులే గంజాయి కేసులో పట్టుబడుతున్నారు. 20 మందికి పైగా అంతర్రాష్ట్ర స్థానిక గంజాయి ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేసి జైలుకు సైతం పంపారు. ప్రధానంగా జిల్లాలోని చౌటుప్పల్ ప్రాంతంలో వలస కార్మికులు ఎక్కువగా ఉండడం అంత రాష్ట్రాల నుంచి ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో అత్యధికంగా గంజాయి ఈ ప్రాంతంలోనే పట్టుబడుతుంది .

**పోలీసులకు చిక్కిన గంజాయి (గ్రాముల్లో)**
చౌటుప్పల్- 4,39,750 భువనగిరి మండలం- 4108, తుర్కపల్లిబి900వలిగొండ-636, బీబీనగర్ -321 భువనగిరి టౌన్ ? 225, మోత్కూర్- 110 బొమ్మలరామారం ? 08రామన్నపేట ? 120
మోట కొండూరు ? 30ఆలేరు ? 150, యాదగిరిగుట్ట-38,




### చిన్న చినుకు పడితే
## బొడ్రాయి బజార్ బురదమయం

**సీసీ రోడ్డుపై నిలుస్తున్న మురుగునీరు**
**తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్కూల్ పిల్లలు, ప్రయాణికులు**
**అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి**

**మాడుగులపల్లి, ఆగస్టు 4 ( జనం సాక్షి):**
నాగార్జునసాగర్ నియోజకవర్గం మాడుగులపల్లి మండలం నారాయణపురం గ్రామంలోని బొడ్రాయి బజార్ నివాసితులు మురుగునీటి సమస్యతో తీవ్ర అవస్థలు పడుతున్నారు బజార్‌లోని సీసీ రోడ్డుపై సరైన సైడ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నిత్యం మురుగునీరు రోడ్డుపైనే పారుతోంది ఇక చిన్నపాటి వర్షం పడితే చాలు రోడ్డంతా చెరువును తలపిస్తూ, దారి పొడవునా బురద పేరుకుపోతోంది దీనివల్ల ముఖ్యంగా ఉదయాన్నే స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, బస్సు పాయింట్‌కు వెళ్లే ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు బురదలో జారిపడి పిల్లలు యూనిఫారాలు పాడవుతుండటంతో పాటు, పలువురు కిందపడి గాయపడిన ఘటనలు కూడా ఉన్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు నిలిచిపోతున్న మురుగునీటి వల్ల దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు ప్రబలి వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు గతంలో సమస్య ఎదురైనప్పుడు అధికారులు తాత్కాలికంగా మట్టి పూడ్చి చేతులు దులుపుకున్నారని, వర్షం రాగానే పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోందని స్థానికులు పేర్కొన్నారు ఇప్పటికైనా అధికారులు పైపై పూతలతో సరిపెట్టకుండా, నాణ్యమైన పక్కా సైడ్ డ్రైనేజీ నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని నారాయణపురం గ్రామ ప్రజలు, బొడ్రాయి బజార్ నివాసులు జిల్లా ఉన్నతాధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

## ఆర్టీసీ ఎన్నికల్లో అశ్వద్ధామరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

### టీఎంయు రాష్ట్ర కార్యదర్శి సుంకరి శ్రీనివాస్

**సూర్యాపేట(జనంసాక్షి):**
ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో తెలంగాణ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అశ్వద్ధామ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని టీఎంయు రాష్ట్ర కార్యదర్శి సుంకరి శ్రీనివాస్ అన్నారు.మంగళవారం నల్లగొండలో నిర్వహించిన తెలంగాణ మజ్దూర్ యూనియన్ రీజియన్ మహాసభకు పాల్గొనేందుకు సూర్యాపేట డిపోకు చెందిన టీఎంయూ సభ్యులు ఆయన ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల విలీన ప్రక్రియను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం పూర్తి చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం, కార్మికుల హక్కుల పరిరక్షణ, సంఘ బలోపేతమే తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన లక్ష్యమని అన్నారు.ఉద్యోగుల సంక్షేమం కోసం యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ప్రతి సభ్యుడు ఐక్యంగా ఉండి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. నల్లగొండ బస్టాండ్ సమీపంలోని రత్న ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రీజియన్ మహాసభకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వద్ధామ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. మహాసభ విజయవంతానికి సూర్యాపేట డిపో సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు బి.భాను, కార్యదర్శి మాచర్ల భాస్కర్, నాయకులు పొద్దుటూరి రమేష్, రాజశేఖర్ రావు, అంజయ్య, చెరుకు వెంకటయ్య, వీరయ్య, డి.ఎస్.రావు, జగదీష్, అనిల్ కుమార్, శంకర్ నాయక్, బుచ్చయ్య, జానయ్య తదితరులు పాల్గొన్నారు.



# జనంసాక్షి' కథనానికి స్పందన.. కదలివచ్చిన మున్సిపల్ యంత్రాంగం

**○చండూరులో రోడ్లు, డ్రైనేజీలపై ఆక్రమణల తొలగింపుకు మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు..**

**○షాపులు, ఇళ్ల యజమానులకు 7 రోజుల గడువు విధింపు..**

**○స్వచ్ఛందంగా తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక**

**చండూరు, ఆగస్టు 4 (జనంసాక్షి)**
చండూరు మున్సిపాలిటీ పరిధిలో రోజురోజుకూ విస్తరిస్తున్న ఆక్రమణలు, డ్రైనేజీలు, రోడ్ల కబ్జాలపై 'జనంసాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి మున్సిపల్ అధికార యంత్రాంగం ఎట్టకేలకు స్పందించింది. "కబ్జా కోరల్లో చండూరు.. మౌన ముద్రలో అధికార యంత్రాంగం" శీర్షికన ప్రచురితమైన కథనంపై స్థానిక ప్రజల నుండి తీవ్ర నిరసనలు, చర్చలు వ్యక్తమవడంతో మున్సిపల్ అధికారులు కదలికలోకి వచ్చారు.ముఖ్యంగా ప్రధాన రహదారుల వెంట డ్రైనేజీలపై నిర్మించిన మెట్లు, రేకుల షెడ్లు, ర్యాంపులు, ఫుట్‌పాత్ ఆక్రమణల వల్ల పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, ట్రాఫిక్‌కు ఆటంకం ఏర్పడుతోందని వార్తా కథనంలో ఎత్తిచూపిన అంశాలను అధికారులు తీవ్రంగా పరిగణించారు.ఈ సమస్యపై చండూరు మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక ప్రకటన విడుదల చేస్తూ.. మున్సిపాలిటీ పరిధిలోని మెయిన్ రోడ్డు వెంట ఉన్న ఆక్రమణలను సంబంధిత షాపుల యజమానులు, ఇళ్ల యజమానులు స్వచ్ఛందంగా 7 రోజులలోగా తొలగించుకోవాలని గడువు విధించారు.పాదచారుల భద్రత, సౌకర్యం మరియు ట్రాఫిక్ రాకపోకలకు ఆటంకం కలగకుండా ఫుట్‌పాత్‌లను కబ్జాల నుంచి విముక్తి చేయాలి.ఇచ్చిన 7 రోజుల గడువులోగా ఆక్రమణలు తొలగించకపోతే మున్సిపల్ నిబంధనల ప్రకారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అధికారులే తొలగిస్తారు.ఆక్రమణల తొలగింపుకు అయ్యే ఖర్చుతో పాటు చట్టపరమైన జరిమానాలను సంబంధిత యజమానుల నుంచే వసూలు చేయడం జరుగుతుంది.ప్రజా సౌకర్యం కోసం రోడ్లను, ఫుట్‌పాత్‌లను ఆక్రమణ రహితంగా ఉంచేందుకు ప్రజలు, వ్యాపారులు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. 'జనంసాక్షి' కథనంతోనైనా యంత్రాంగం స్పందించి చర్యలకు శ్రీకారం చుట్టడంపై చండూరు పట్టణ ప్రజలు, పాదచారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలి..
7 రోజులు గడువు
చండూరు, ఆగస్టు 3 (జనంసాక్షి)
జనంసాక్షి
04 Aug 2026 - Page 8
https://epaper.janamsakshi.org/clip/525046


జనంసాక్షి
www.janamsakshi.org
కబ్జా కోరల్లో చండూరు ..
మౌన ముద్రలో అధికార యంత్రాంగం!
చండూరు, ఫిబ్రవరి 21 (జనంసాక్షి)
మిగతా 2లో
జనంసాక్షి
22 Feb 2026 - Page 1



## మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం

### లబ్ధిదారులకు రూ. 27.03 లక్షల కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

### ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**కొండమల్లేపల్లి, ఆగస్టు 4 (జనంసాక్షి):**
కొండమల్లేపల్లి మండలానికి చెందిన 27 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 27,03,132 విలువైన కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాలపై వివాహ సమయంలో పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కల్యాణ లక్ష్మి పథకం ఎంతో ఉపయోగపడుతోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పాలనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. కల్యాణ లక్ష్మి పథకం ద్వారా పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహానికి ప్రభుత్వం ఆర్థిక చేయూత అందించడం వల్ల కుటుంబాలకు ఎంతో ఊరట లభిస్తోందన్నారు. ప్రజలకు హామీ ఇచ్చిన సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేస్తూ అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సహాయం అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్, జరుపుల శంకర్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి పద్మనాభరెడ్డి సేవలు చిరస్మరణీయం

**కోదాడ టౌన్ ఆగస్టు 04 ( జనంసాక్షి )**
సమాజంలో అనగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు పద్మనాభరెడ్డి సేవలు చిరస్మరణీయమని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు.మంగళవారం కోదాడ పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో పద్మనాభ రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా కోదాడ ఐఏఎల్ అధ్యక్షులు అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మనాభరెడ్డి న్యాయవాదిగా 50 వేలకు పైగా క్రిమినల్ కేసుల్లో పేదల తరఫున నిలబడి న్యాయం చేకూర్చారని గుర్తుచేశారు. ఐఏఎల్ వ్యవస్థాపక నాయకుడిగా సంఘ బలోపేతానికి అహర్నిశలు శ్రమించారని కొనియాడారు.ఈ



కార్యక్రమంలో ఐ,ఏ,ఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గట్ల నరసింహ రావు,సీనియర్ న్యాయవాది సాధు శరత్ బాబు,ఐఏఎల్ కోదాడ శాఖ కార్యదర్శి వెంకట చలం, న్యాయవాదులు మహ్మద్ రియాజ్,సామ నవీన్ కుమార్,కంచర్ల శరత్ కుమార్,బొడ్డుపల్లి శ్రీనివాస్,దుగ్గి వెంకటేశ్,రవీందర్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## మాడుగులపల్లి - ఇందుగుల రోడ్డు పనుల్లో తీవ్ర జాప్యం

### బురదమయంగా మారిన బాట, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై ప్రజల మండిపాటు

**మాడుగులపల్లి ఆగస్టు 4 ( జనం సాక్షి):**
మాడుగులపల్లి ? ఇందుగుల ప్రధాన రహదారి నిర్మాణం కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి, అధికారుల పర్యవేక్షణా రాహిత్యానికి నిలువుటద్దంగా మారింది ఏళ్ల తరబడి పనులు నత్తనడకన సాగుతుండటంతో నిత్యం ఈ బాటలో ప్రయాణించే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్డు పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది టైర్లలో ఇరుక్కుంటున్న మట్టి ఎక్కడికక్కడ ఆగిపోతున్న బండ్లు రోడ్డు నిర్మాణంలో భాగంగా కాంట్రాక్టర్ పోసిన నాణ్యత లేని మట్టి వర్షపు నీటికి రసకగా మారి బురదగుంటను తలపిస్తోంది ద్విచక్ర వాహనాల టైర్లల్లో మట్టి కూరుకుపోయి ఎక్కడికక్కడ బండ్లు నిలిచిపోతున్నాయి బండి దిగి నడవాలన్నా, నెట్టుకుంటూ వెళ్లాలన్నా ప్రాణాలు గాల్లో కలసిపోతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు చిన్న వర్షానికే రోడ్డు ముఖచిత్రం ఇలా తయారైతే, మున్ముందు భారీ వర్షాలు కురిస్తే ఈ రోడ్డెక్కి ఎలా ప్రయాణించాలంటూ ప్రజలు భయాందోళన చెందుతున్నారు రోడ్డెక్కి రావాలంటేనే గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి కాంట్రాక్టర్‌కు ప్రయాణికుల నరకం కనబడటం లేదా? ప్రజాధనం తింటూ పనులు గాలికి వదిలేసే ఇలాంటి కాంట్రాక్టర్లకు పనులు ఎలా అప్పగిస్తారు? స్థానిక ప్రయాణికుల ఆగ్రహంఆ కాంట్రాక్టర్‌పై చర్యలేవి?మండిపడుతున్న ప్రజలుప్రజల ఇబ్బందులు పడుతున్నా కాంట్రాక్టర్ తీరులో మాత్రం ఏమాత్రం మార్పు రావడం లేదు. నాణ్యతా ప్రమాణాలు గాలికొదేసి, పనుల్లో తీవ్ర జాప్యం చేస్తున్న సదరు కాంట్రాక్టర్‌పై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు, ప్రయాణికులు బొబ్బేడుతున్నారు ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నిద్రమత్తు వీడి, తక్షణమే స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయించాలని, ప్రజలకు బాటను అందుబాటులోకి తేవాలని తీవ్ర స్థాయిలో డిమాండ్ చేస్తున్నారు.





## రోడ్డు ప్రమాదాల నివారణకే ప్రాధాన్యత

### హైవేపై గుంతలను పూడ్చిన సూర్యాపేట ట్రాఫిక్ పోలీసులు

**సూర్యాపేట (జనంసాక్షి):**
సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ ఆదేశాల మేరకు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ, సిబ్బంది మంగళవారం సామాజిక బాధ్యతగా సూర్యాపేట పట్టణ పరిధిలోని గల జాతీయ రహదారి 65 పై వాహనదారులకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న పెద్ద పెద్ద గుంతలను ట్రాఫిక్ పోలీసులు దగ్గరుండి పూడ్చివేయించారు. రోడ్డు విస్తరణ పనులు, వర్షాలు, వాహనాల రద్దీ కారణంగా సూర్యాపేట పట్టణ పరిధిలో జాతీయ రహదారిపై ప్రమాదకరమైన గుంతలు ఏర్పడ్డాయి.దీని వల్ల ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనాల చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.వాహనాల వేగం అకస్మాత్తుగా తగ్గడం వల్ల ట్రాఫిక్ జామ్‌లు కూడా ఏర్పడుతున్నాయి.ఈ విషయాన్ని గమనించిన ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, తక్షణమే స్పందించి రోడ్డుపై ఉన్న గుంతలను మట్టి, కంకరతో నింపి తాత్కాలికంగా మూసివేశారు.వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రోడ్డును సమన్వయం చేశారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ మాట్లాడుతూ వాహనదారుల భద్రతే తమ మొదటి ప్రాధాన్యత అని తెలిపారు. జాతీయ రహదారిపై ప్రయాణించేటప్పుడు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యగా ఈ గుంతలను పూడ్చినట్లు పేర్కొన్నారు. హైవేపై ప్రయాణించే వాహనదారులు కూడా నిఘా నిబంధనలు పాటిస్తూ, పరిమిత వేగంతో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.





## నియోజకవర్గ స్థాయి వర్కింగ్ జర్నలిస్టుల సమావేశాన్ని విజయవంతం చేయాలి: గురుపాదం

నాంపల్లి,ఆగస్టు 03 (జనం సాక్షి)
మునుగోడు నియోజకవర్గంలో వివిధ మండలాల నుండి వర్కింగ్ జర్నలిస్టులుగా విధులు నిర్వహిస్తున్న నియోజకవర్గ ప్రింట్ మీడియా ఁ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులందరు ఆగస్టు 5న బుధవారం ఉదయం 11 గంటలకు నాంపల్లి మండలం లోని తుంగపాటి గౌరారం రెవిన్యూ గ్రామ శివారులో స్వయంభుగా వెలసిన పురాతన పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీ శ్రీ చలీదోన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న నియోజకవర్గస్థాయి వర్కింగ్ జర్నలిస్టుల సమావేశానికి పనిచేస్తున్న ప్రతి జర్నలిస్టు హాజరు కావాలని ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ మాజీ చైర్మన్ఁ టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ, తెలంగాణ రాష్ట్ర టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ సాగర్ , టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి పి యోగానంద , టియుడబ్ల్యూజే ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు అవ్వారి భాస్కర్, నల్లగొండ జిల్లా టియుడబ్ల్యూజే అధ్యక్షులు గుండెలోని జయశంకర్ గౌడ్ , టి యు డబ్ల్యూ జే నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివ ప్రసాద్ , నల్లగొండ జిల్లా టియుడబ్ల్యూజే ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, మునుగోడు నియోజకవర్గం టి యు డబ్ల్యూ జే అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు,నల్లగొండ జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాలకు చెందిన యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, సమావేశానికి హాజరు కానున్నారు అని జర్నలిస్టు ల సమస్యల మీద, జర్నలిస్టు ల డిమాండ్ ల గురించి చర్చలు ఉంటాయి అని నాంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గాలెంకా గురుపాదం తెలిపారు.

## మండల కేంద్రంలో ఎంపీఓ కార్యాలయం వద్ద బిఆర్ఎస్ నిరసన కార్యక్రమం





**చింతలపాలెం(జనంసాక్షి)**
మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు గుడిమల్కాపురం గ్రామంలోని నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించి కోర్టు ఉత్తర్వులను అధికారులు అమలు చేయాలని మండలంలోని బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు చింతలపాలెం లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందించి అక్కడ నుండి నడుచుకుంటూ ఎంపీడీవో కార్యాలయం దగ్గరికి వెళ్లి ధర్నా చేశారు.ఎలాగైనా గుడిమల్కాపురం గ్రామంలోని నూతన గ్రామపంచాయతీ ని ప్రారంభం చేయాలని మరియు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే అమలు చేయాలని సూచించారు.అట్టి వినతి పత్రాన్ని ఎంపీఓ భూపాల్ రెడ్డి కి అందజేశారు.ఈ సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ చింతలపాలెం పోల్నేడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్తంకుమార్ రెడ్డి ని గ్రామంలో మరియు మా మండలంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి మీకు మా గ్రామపంచాయతీ కనపడుతుందా అది ఆపడానికి మీరు ఎందుకు అంత కక్ష కట్టారు.ఎల్నినో ప్రభావంతో మా మండలంలో సాగునీరు మరియు తాగునీరు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు.అలాగే శివగంగా లిఫ్ట్ దొండపాడు లిఫ్ట్ రెండు కూడా ఆపరేషన్లు ఉండి ఉంటే ఈరోజు మా మండలం ఇంత కరువు వచ్చి ఉండేది కాదు,కానీ వీటన్నిటి మీద దృష్టి పెట్టకుండా మా గ్రామ పంచాయతీకి అన్ని రకాల పర్మిషన్లు ఉన్నా కూడా ఇక్కడున్న కాంగ్రెస్ నాయకుల ఒత్తిడికి మీరు తలోగ్గి మీరు ఒక రాష్ట్ర మంత్రి అని కూడా మర్చిపోయి నాలుగు కోట్ల మంది జనాభాకి మంత్రి అయిన మీరు కేవలం 4000 జనాభా లేని గ్రామ పంచాయతీలో రాజకీయం చేయడం మీ స్థాయికి తగినది కాదని అర్థం చేసుకుంటారు అనుకుంటున్నాను. అలాగే ఇక్కడ భూకబ్జాలు చేస్తున్న వారికి మీరు అండదండగా నిలుస్తున్నా రని ప్రజలు మీకు ఓటుతో సమాధానం చెబుతారు ఇకనైనా ఇలాంటివి మాను కోవాలని మా గ్రామ పంచాయతీని త్వరగా ఓపెన్ చేసి గుడిమల్కాపురం గ్రామాభివృద్ధికి తోడ్పాటు కావాలని ఆ మనసును మీకు అందించాలని ఆ దేవుని కోరుకుంటున్నాను అని శ్రీనివాస రావు చెప్పారు.ఇట్టి కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మధిర సత్యనారాయణ రెడ్డి,మోర్తల వెంకట్ రెడ్డి,మాజీ ఎంపీపీ వెంకట్ రెడ్డి,గుడిమ ల్కాపురం ఉపసర్పంచ్ మెడిశెట్టి నరసింహారావు,రామా ప్రభాకర్,మార్తల నాగిరెడ్డి మరియు ముఖ్య కార్యకర్తలు బిఆర్ఎస్ నాయకులు గుడిమల్కాపు రం గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రజల అవసరాలే కాంగ్రెస్ ప్రభుత్వం ఎజెండా..

○ దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్
○రూ. 372.00 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన

### ప్రతి గ్రామానికి మెరుగైన రహదారులే ప్రభుత్వ లక్ష్యం..!



**పి.ఏ.పల్లి,ఆగస్టు 04(జనంసాక్షి):**
పి.ఏ.పల్లి మండలం నీలంనగర్ స్టేజీ వద్ద సూరెపల్లి నుండి అంగడిపేట వరకు చిలకమర్రి మరియు నీలంనగర్ గ్రామాల మీదుగా రూ.372.00 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు దేవరకొండ దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన రహదారుల నిర్మాణం ద్వారా ప్రజల రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా గ్రామాల అభివృద్ధికి కొత్త దిశను చూపుతున్నామని తెలిపారు.సూరెపల్లి ? అంగడిపేట రహదారి నిర్మాణం పూర్తయితే చిలకమర్రి, నీలంనగర్ గ్రామాల ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని అన్నారు.రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు వేగంగా తరలించడానికి ఈ రోడ్డు ఎంతో ఉపయోగపడుతుందని, విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర వైద్య సేవలు పొందే వారికి కూడా ప్రయాణ సమయం తగ్గి ఇబ్బందులు తొలగిపోతాయని పేర్కొన్నారు.గతంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ రహదారులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యతతో అభివృద్ధి చేస్తోందని,ప్రతి రూపాయి ప్రజల అభివృద్ధికే ఖర్చు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అవసరమైన చోట్ల నాణ్యమైన రహదారులు,డ్రైనేజీలు,ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనలో తెలంగాణలో గ్రామీణ అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో పి.ఏ.పల్లి, గుడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నెర్మటి సతీష్ రెడ్డి,మావిళ్ల లక్ష్మీనారాయణ,పి.ఏ.సి.ఎస్ చైర్మన్ తేర మణిపాల్ రెడ్డి,డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్ రెడ్డి,యల్లయ్య యాదవ్,జిల్లా కార్యదర్శి మద్దిమడుగు రామస్వామి,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తేర సత్యనారాయణ రెడ్డి,ఏ వి రెడ్డి,ధర్మారెడ్డి,ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్,బొడ్యా నాయక్,కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,పొతేం సహదేవుడు,దయాకర్ రెడ్డి,సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు తూటిపల్లి సత్తెమ్మ నాగేష్,సర్పంచులు దూదిపాల అశ్విని రాజేందర్ రెడ్డి,రమావత్ చిరంజీవి,కిషన్,వెంకటయ్య మండల ముఖ్య నాయకులు,సంబంధిత శాఖ అధికారులు, గ్రామ పెద్దలు,పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





## భూతం పెద్ద బుచ్చయ్య మృతి బాధాకరం

### దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

**పి.ఏ.పల్లి/గుడిపల్లి,ఆగస్టు 04(జనంసాక్షి)**
గుడిపల్లి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు భూతం పెద్ద బుచ్చయ్య మృతి బాధాకరం అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.మంగళవారం గుడిపల్లి గ్రామానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ భూతం పెద్ద బుచ్చయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద బుచ్చయ్య మరణం పార్టీకి తీరని లోటని ఆయన పేర్కొన్నారు.ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ అర్వపల్లి నర్సింహ,మునగాల అంజి రెడ్డి, తోటకూరి పరమేష్, ఎర్ర యాదగిరి,రమావత్ శ్రీను,సైదులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,తదితరులు ఉన్నారు.

## అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీడీవో



**నూతనకల్ ఆగస్టు 3 ( జనంసాక్షి)**
మండల పరిధిలోని టీక్య తండా గ్రామపంచాయతీ లో మంగళవారం ఎంపీడీవో సునీత ఆకస్మికంగా పర్యటించారు. అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి రికార్డులు, పిల్లల పౌష్టికాహార నిల్వలను పరిశీలించి మెనూ ప్రకారం పిల్లలకు గర్భిణీ తల్లులకు సరియైన పౌష్టికాహారం అందించాలని అన్నారు ఎంపీపీఎస్ టీక్యా తండా పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు అనంతరం గ్రామపంచాయతీ నర్సరీని పరిశీలించి మొక్కలను వన మహోత్సవంలో భాగంగా విరివిగా చెట్లు నాటించాలని ఫీల్డ్ అసిస్టెంట్ ను ఆదేశించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి సుధాకర్, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

# సేవకు సరిహద్దులు లేవు - మానవత్వానికి ప్రాంతాలు లేవు

రామన్నపేట, ఆగస్టు 4 (జనంసాక్షి):
ఏ ప్రాంతం వారైనా ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడమే నిజమైన మానవత్వం అని సామాజిక కార్యకర్త వేముల సైదులు, ఎన్నారం పాఠశాల ఉపాధ్యాయులు నీలం శేఖర్ పేర్కొన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు వారు అండగా నిలుస్తూ విద్య, వైద్యం, జీవనోపాధి తదితర రంగాల్లో మానవతా దృక్పథంతో పలు సేవా కార్యక్రమాలు మిత్రుల సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు చేపట్టిన ముఖ్యమైన సేవా కార్యక్రమాలను వివరించారు. తొండ తిరుమలగిరి మండలం కొత్తగట్టు గ్రామానికి చెందిన స్వాతి చిన్న వయసులోనే మృతి చెందడంతో, ఆమె ఇద్దరు కుమార్తెల భవిష్యత్తుకు భరోసా కల్పించాలనే ఉద్దేశంతో వారి పేర్లపై అక్షర చైతన్య వారధులు లక్ష రూపాయలు ఆత్మీయ కుటుంబ సభ్యులు 65000/-క్లాస్ మెంట్ ద్వారా 23000/- మొత్తం ?1,88,000/- డిపాజిట్ చేయించినట్లు తెలిపారు. తల్లి లేని లోటును తీర్చలేకపోయినా, చిన్నారుల భవిష్యత్తుకు కొంత భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ సహాయం అందించినట్లు పేర్కొన్నారు. అలాగేకోదాడ సమీపంలోని మేళ్లచెరువు మండలం మంగళకుంట తండాకు చెందిన రవి నాయక్ ఎం ఏ, బి ఈ డి పూర్తి చేసి ఉన్నత విద్యను అభ్యసించినప్పటికీ, నరాల బలహీనత కారణంగా కదలలేని పరిస్థితిలో ఉన్నారని తెలుసుకొని ఆయన అవసరాన్ని గుర్తించి రూ. 90,000 విలువైన ఎలక్ట్రిక్ వీల్‌చైర్‌ను అందించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8 వ తరగతి విద్యార్థులకు పేద ప్రతిభా వంతులకి 60,000 వచ్చే స్కాలర్ షిప్... సాధించుటకు ఎన్.ఎం.ఎం.ఎస్ బుక్స్ రాష్ట్ర వ్యాప్తంగా ఇస్తున్నామని,మన ఆపద్బాంధవులు ఫౌండేషన్ ద్వారా పదుల సంఖ్యలో వారి కుటుంబాలకు నెలకి సరిపడే 50 లేదా 25 కిలోల బియ్యం, 16 రకాల నిత్యావసర వస్తువులు అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన కొన్ని కుటుంబాలకు కుట్టు మిషన్లు, మరికొన్ని కుటుంబాలకు కిరాణా దుకాణాలు ఏర్పాటు చేసి జీవనోపాధి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కేవలం ఆపదలో ఉన్న కుటుంబాలకు తక్షణ సహాయం అందించడమే కాకుండా, వారు భవిష్యత్తులో ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధి ద్వారా తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే తమ సేవా కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలు, మిత్రులు, ఉపాధ్యాయులు, పలు సేవా సంస్థల సభ్యులకు వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచేందుకు మరింత మంది ముందుకు రావాలని పిలుపునిచ్చారు.







## కాంగ్రెస్ పార్టీ నాయకులు జైపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

సంస్థాన్ నారాయణపురం. ఆగస్టు 4. ( జనం సాక్షి):
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం చిమిర్యాల మాజీ సర్పంచ్,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దోనూరు జైపాల్ రెడ్డి జన్మదిన వేడుకలను మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే జైపాల్ రెడ్డి కి షాలువా కప్పి,సన్మానం చేసి ఆయనతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పబ్బు రాజు గౌడ్,చిలుకూరి ప్రభాకర్ రెడ్డి,నారాయణపురం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీను నాయక్,నారాయణపురం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి,మల్లారెడ్డి గూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నర్రి మల్లేశం,గిరి,శేఖర్,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండలనాయకులు,కార్యకర్తలు,అభిమానులు,తదితరులు,పాల్గొన్నారు.

## సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించే వరకు పోరాడుతాం



సూర్యాపేట(జనంసాక్షి):
సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించే వరకు పోరాటం ఆగదని సూర్యాపేట రైల్వే సాధన సమితి కన్వీనర్ దేగల జనార్ధన్, కో కన్వీనర్లు రాచూరి ప్రతాప్, డాక్టర్ రమేష్ చంద్ర అన్నారు. సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఆ కార్యాలయం వద్ద రైల్వే మార్గం,సూర్యాపేట మీదుగా హైస్పీడ్ రైల్ కోసం ప్రజాపిలుపు కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఇప్పటికే రైల్వే సౌకర్యం కొరకు ప్రజా సంఘాలు, సామాజిక శక్తులతో, మేధావులతో, సూర్యాపేట ప్రగతిని కాంక్షించే వారితో కమిటీ వేశామని తెలిపారు. సూర్యాపేటకు రైల్వే సౌకర్యం సాధించేవరకు కొరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే సాధన సమితి గౌరవ అధ్యక్షులు డాక్టర్ రంగారెడ్డి, గౌరవ సలహాదారులు డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్,లింగంపల్లి భద్రయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తలమల్ల హస్సేన్,డాక్టర్ రమేష్ చంద్ర, మామిడి అంజయ్య, బికుమల్ల ఉపేందర్, నల్లపాటి అప్పారావు, తొగిటి మురళి, నల్లకుంట్ల అయోధ్య, రిటైర్డ్ టీచర్ నరసయ్య, సముద్రాల రాంబాబు, మంజుల, తోట శ్యాంప్రసాద్, పోతరాజు నరసయ్య,నారబోయిన వెంకట యాదవ్,ఎర్ర అఖిల్,అక్కినపల్లి రాము, రాచూరి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పెద్దన్నలా అండగా నిలిచిన పీజీఆర్

**మెడ శస్త్రచికిత్స చేయించుకున్న భిక్షమయ్యకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి ఆర్థిక సహాయం**

గుర్రంపోడు, ఆగస్టు 4 (జనంసాక్షి)
ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఎప్పుడూ ముందుండే బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పీజీఆర్ (పాశం గోపాల్ రెడ్డి) మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. గుర్రంపోడు మండలం తేనెపల్లి గ్రామానికి చెందిన ముడియపాక భిక్షమయ్య ఇటీవల మెడకు శస్త్రచికిత్స చేయించుకోవడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న పీజీఆర్ వెంటనే స్పందించి, బాధిత కుటుంబానికి తన వంతు ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.వైద్య చికిత్సల కారణంగా అప్పుల భారంతో ఇబ్బందులు పడుతున్న భిక్షమయ్య కుటుంబాన్ని పరామర్శించిన పీజీఆర్, కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవడం ప్రతి ప్రజాప్రతినిధి, ప్రతి సామాజిక బాధ్యత కలిగిన వ్యక్తి కర్తవ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక నాయకులు మాట్లాడుతూ, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ అవసరమైన ప్రతి సందర్భంలో స్పందించే నాయకుడిగా పీజీఆర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల్లో ఆయన ఎప్పుడూ ముందుంటూ ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామాంజ నేయులు, ఏనుగు భాషలు, వేణుగోపాల్ రెడ్డి, మునుకుంట్ల రాజేష్ రెడ్డి, వెల్దండ వెంకటరెడ్డి, కృష్ణా గౌడ్, ఉల్కి చంటి, మేకల రఘుపతి రెడ్డి, జాల మల్లేష్, సతీష్, నల్ల నందు, గౌరీ తదితరులు పాల్గొన్నారు.



## నషా ముక్త యువా ఫర్ వికసిత్ భారత్ పోటీల్లో ఆర్మీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

**ఆరు విభాగాల్లో బహుమతులు.. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక**



భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 4 (జనంసాక్షి):
మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలో గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఆర్మ్డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ డిగ్రీ కళాశాల ఫర్ ఉమెన్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు “నషా ముక్త యువా ఫర్ వికసిత్ భారత్” కార్యక్రమంలో భాగంగా ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల, భువనగిరి, మై భారత్ కేంద్రం, యాదాద్రి భువనగిరి జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. యూనిట్ 1, యూనిట్ 2కు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రూప్ సింగింగ్‌లో ప్రథమ, నుక్కడ్ నాటకంలో ద్వితీయ, స్లోగన్ రైటింగ్‌లో ద్వితీయ, షార్ట్ ఫిల్మ్‌లో ద్వితీయ, కవిత్వంలో తృతీయ, శాస్త్రీయ నృత్యంలో తృతీయ బహుమతులు సాధించి కళాశాలకు గౌరవం తీసుకొచ్చారు. గ్రూప్ సింగింగ్‌లో ప్రథమ బహుమతి సాధించిన బృందం రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. శ్రీలత, డైరెక్టర్ కల్నల్ రాజా దత్త, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా. ఎన్. పవని, డా. ఎన్. పద్మమ్మ, అధ్యాపకులు, ఆర్మీ డ్రిల్ ఇన్‌స్ట్రక్టర్లు విజేతలను అభినందించి, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

## జానీమియా సేవలు చిరస్మరణీయం



సూర్యాపేట(జనంసాక్షి) :
తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ ఎస్.కె. జానీమియా సేవలు చిరస్మరణీయమని టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి దున్న శ్యామ్, ఇరిగేషన్ సీఈ నాగభూషణం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయంలో జానీమియా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జానీమియా తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమించిన నాయకుడని, అందరినీ సమానంగా చూసే గొప్ప వ్యక్తిత్వం కలిగిన నాయకుడని కొనియాడారు. గెజిటెడ్ హోదాకు వెళ్లిన తర్వాత కూడా నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘంతోనే కొనసాగుతానని ప్రకటించి, ఉద్యోగుల పట్ల తన అంకితభావాన్ని చాటుకున్నారని అన్నారు. ఉద్యోగ సంఘంలో ఎలా పని చేయాలో, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎలా పోరాడాలో ఎంతో మందికి మార్గనిర్దేశం చేశారని పేర్కొన్నారు. జానీమియా అకాల మరణం ఉద్యోగ సంఘానికి తీరని లోటని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నాయిని ఆకాష్ వర్మ, ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, సుమన్, భూపతి వెంకన్న, మదిపడగ సైదులు, నందిపాటి రవి, అల్లి సతీష్, బి.ప్రకాష్, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

## పినపాక పీహెచ్‌సీలో ఆశాడే కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ తుకారాం రాథోడ్





**పినపాక, ఆగస్టు 04(జనంసాక్షి):** పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య సేవలు, రికార్డులు, నివేదికలు, వివిధ వార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్ వంటి సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశం ఉన్నందున ఫీల్డ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రతిరోజూ ఇంటింటి సర్వే నిర్వహించాలని సూచించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని వెంటనే గుర్తించి అవసరమైన రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయాలని, ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అన్నారు.ప్రతి మంగళవారం, శుక్రవారం "ఫ్రైడే డ్రై డే" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ యాంటీ లార్వల్ చర్యలు చేపట్టి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే 14 సంవత్సరాల బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వెంటనే సేవలు అందించేలా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం అనంతరం డీఎంహెచ్‌ఓ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు మరింత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రతాప్, వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రాంప్రసాద్, హనుమంత, సూపర్వైజర్లు, ఆశా కార్యకర్తలు, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలకు శీనన్న ఆత్మీయ భరోసా

**ఖమ్మం రూరల్, ఆగస్టు 04 (జనం సాక్షి):** ఇటీవల కుటుంబ సభ్యులను కోల్పోయి తీరని శోకంలో ఉన్న 45 నిరుపేద కుటుంబాలకు 'శీనన్న ఆత్మీయ భరోసా' కొండంత అండగా నిలిచింది. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన బాధిత కుటుంబాలకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ. 10 వేల చొప్పున మొత్తం రూ. 4,50,000 ఆర్థిక సాయాన్ని మంగళవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తరపున బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో తమను ఆర్థికంగా ఆదుకున్న మంత్రి పొంగులేటికి, పీఎస్ఆర్ ట్రస్ట్‌కు లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమం లో ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్ పర్సన్ తమ్మినేని నవీన్, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బానోత్ కిషోర్, కౌన్సిలర్లు కొమరగిరి సత్యవతి,బానోత్ ప్రసాద్, కడవ నవీన్, బుర్ర మహేష్,అజ్మీరా అశోక్, వెంపటి రవి,వెంకటనారాయణ, సుమన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ హైకోర్టులో 5 ఏళ్ల పోరాటానికి విజయం

### మాజీ సింగరేణి జూనియర్ పంచాయతీ కార్యదర్శి మురళికి మళ్లీ పోస్టింగ్

**కామేపల్లి,ఆగస్టు 4 (జనం సాక్షి):** సింగరేణి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ 2020లో విధుల నుంచి తొలగింపునకు గురైన.కామేపల్లి గ్రామానికి చెందిన ఎం.మురళి సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత మళ్లీ తన ఉద్యోగాన్ని సాధించారు.ఈ వ్యవహారం పై మురళి దాఖలు చేసిన పిటిషన్ ను విచారించిన తెలంగాణ హైకోర్టు.. అప్పటి కలెక్టర్ ఆర్.వీ.కర్ణన్ ఇచ్చిన తొలగింపు ఉత్తర్వులను పక్కనపెట్టి మురళిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తీర్పునిచ్చింది.హైకోర్టు ఆదేశాల మేరకు స్పందించిన ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ ఎం. మురళిని తిరిగి విధుల్లోకి తీసుకుంటూ గ్రామ పంచాయతీ జూనియర్ సెక్రటరీగా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఐదేళ్ల తర్వాత న్యాయం గెలిచి మళ్లీ విధుల్లో చేరుతుండటంతో మురళి తన ఆనందను మంగళవారం వ్యక్తం చేశారు.






## ఆగస్టు 10న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జైలు భరో జయప్రదం చేయండి: సిఐటియు

**టేకులపల్లి,ఆగస్టు 4(జనంసాక్షి):** మండలంలోని ముత్యాలం పాడు ఎక్స్ రోడ్ సులానగర్ పీహెచ్సీ లో సీఐటీయూ మండల జనరల్ బాడీ సమావేశం మజహరి (విజయ) అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అబ్దుల్ నబీ, మండల కన్వీనర్ హైమావతి లు పాల్గొని మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన నూతన విత్తన చట్టం, నూతన విద్యుత్ చట్టం,విబిజిరామ్ జీ చట్టం లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి 29 చట్టాలను యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో ఆగస్టు 10న జైలు భరో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఇది తధ్యమని వారు జోస్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో బాదావత్ విజయ,గొప్ప నిర్మల,వాంకుడోత్ లక్ష్మి,గుంటి చైతన్య, సీతా దేవి, రజియా,లక్ష్మి, దొడ్డ సుగుణ, శ్రీలత, వెంకట రమణ పునెం శిరోమణి,రాజేశ్వరి, అరుణ ,మంగ,సులోచన,మంగ,విజయలక్ష్మి, తార తదితరులు పాల్గొన్నారు.



## ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవం విజయవంతం చేయాలి

**దమ్మపేట ఆగస్టు 4 (జనం సాక్షి):** ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ చేతుల మీదుగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో కరపత్రాలు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర కోశాధికారి కోర్సా వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి గూడెంలో ఆదివాసి జెండా ఎగర వెయ్యాలని జాతి ఐక్యతను చాటాలని తమ జాతి హక్కులను చట్టాలను రక్షించడానికి బలమైన ఉద్యమం నిర్మించే దిశగా యువత అడుగులు వేయాలని తెలిపారు.అలాగే ప్రపంచ ఆదివాసి దినోత్సవం రోజున ప్రతి ఒక్క ఆదివాసి జిల్లా ప్రధాన కేంద్రమైన కొత్తగూడెంలో ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే భారీ సాంస్కృతిక ర్యాలీకి హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు తెల్లం రామారావు దొర, ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు గడ్డం వెంకటేశ్వరరావు,ఆదివాసి యువ నాయకులు కాకా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ క్యాలెండర్ సాధించే వరకు విశ్రమించేది లేదు

**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 04( జనం సాక్షి )** రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతోందని, ఉద్యోగాలు రాక, నోటిఫికేషన్లు లేక యువత తీవ్ర మానసిక వేదనకు గురవుతోందని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గానికి చెందిన గడ్డం వేణు కుమార్ అనే నిరుద్యోగి నోటిఫికేషన్లు రాకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తీవ్ర విచారకరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బాధితుడికి అండగా నిలుస్తూ, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు ఖమ్మంలో నిరసన స్వరం వినిపించారు.రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని, సరూర్‌నగర్ యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రతి మాటను అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి గట్టిగా డిమాండ్ చేశారు. నోటిఫికేషన్లు రాకపోవడంతో తీవ్ర నిరాశ, నిరాశ్రయులకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గానికి చెందిన గడ్డం వేణు కుమార్ అనే యువకుడిని మంగళవారం బీజేపీ బృందం పరామర్శించింది. ఖమ్మంలో చికిత్స పొందుతున్న వేణు కుమార్‌ను బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర మెడికల్ సెల్ నాయకులతో కలిసి డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి సందర్శించి, అతని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో చర్చించారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ పరామర్శ



కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ గొంగూర వెంకటేశ్వర్లు, మేకల నాగేందర్, ఆర్.వి.ఎస్. యాదవ్, సాయిరాం, ప్రతాప్, అర్బన్ మండల అధ్యక్షులు వాకదాని రామకృష్ణతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బొల్లారంలో కామినేని హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం



**గుర్రంపోడు, ఆగస్టు 4 (జనం సాక్షి):** గుర్రంపోడు మండలం బొల్లారం గ్రామంలో నార్కెట్‌పల్లి కామినేని హాస్పిటల్ సౌజన్యంతో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వెలగపూరి రాంబాబు రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ రాంబాబు రావు మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, ప్రజాప్రతినిధులు, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, కామినేని హాస్పిటల్ వైద్య బృందం పాల్గొన్నారు.





## ప్రభుత్వం పాఠశాలలో అల్పాహారం ప్రారంబించిన ఎ ఎం సి చైర్ పర్సన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి

**కల్లూరు ఆగస్టు 04(జనంసాక్షి)**

ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అల్పాహార పథకాన్ని ఏఎంసీ చైర్పర్సన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి స్థానిక బాలికలు ఉన్నత పాఠశాల,ప్రాథమిక పాఠశాలలో, ఎం ఈఓ పొదిలిపద్మ తో కలిసి మంగళవారం ప్రారంబించారు ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు బలమైన ఆహారాన్ని అందించడం కోసం అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ పథకాన్నివిద్యార్థులుసద్వినీ యోగం చేసుకోవాలని కోరారు ఉపాధ్యాయులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లి దండ్రులకు వివరించి ప్రభుత్వ పాఠశాలలో హాజరు శాతాన్ని పెంచాలని కోరారు. ఎంఈఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అల్పాహార పథకాన్ని మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ హై స్కూల్స్, పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కల్లూరు లోని పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ కౌన్సిలర్ దాసరి సుధారాణి, శాంతినగర్ లోని ప్రాథమిక పాఠశాలలో కౌన్సిలర్ కంభంపాటి రాధా అల్పాహార పథకాన్ని స్థానికప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పలువురు గ్రామ పెద్దలతో కలసి ప్రారంభించారు. అల్పాహార పథకం ప్రారంభ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

## 28వ వార్డులో పర్యటించిన కమిషనర్ అల్లా శ్రీనివాస్ రెడ్డి

**కమిషనర్‌కు సమస్యలు వివరించిన సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు**

**ఖమ్మం రూరల్, ఆగష్టు 04 (జనంసాక్షి)**



ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డులో నెలకొన్న ప్రధాన సమస్యలపై సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు చొరవతో మున్సిపల్ కమిషనర్ అల్లా శ్రీనివాస్ రెడ్డి మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా షాబాద్ నగర్ వద్ద ఏర్పాటు చేసిన పైప్‌లైన్ పరిస్థితి, నారా పొంగు బజారుకు వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా ఎత్తుగా ఉన్న చిన్న కల్వర్టు, అలాగే ఓ పత్రిక కార్యాలయం సమీపంలోని ఎన్ఎస్పీ కాలువను కమిషనర్ పరిశీలించారు. అలాగే పలు అభివృద్ధితోపాటు సమస్యలను కమిషనర్ కు వివరించారు. వార్డు అభివృద్ధికి అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను వివరించిన కౌన్సిలర్, పైప్‌లైన్, కల్వర్టు, కాలువ సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని కోరారు. ప్రజల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపేలా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి అవసరమైన చర్యలు చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

**అడ్డగూడూర్, ఆగస్టు 4 (జనం సాక్షి):**

అడ్డగూడూర్‌కు చెందిన బాలెంల మల్లేస్వామి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రూ. 50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి సందీప్ రెడ్డి విజ్ఞప్తి మేరకు మంత్రి వెంటనే స్పందించి ఈ సహాయాన్ని అందించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కడారి రమేష్, బైరెడ్డి సందీప్ రెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అండగా నిలుస్తారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అధికారులతో మాట్లాడి గ్రంథాలయ సమస్యలను పరిష్కరిస్తా

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా**

**కామేపల్లి,ఆగస్టు 4 (జనం సాక్షి):**

జిల్లా అధికారులతో మాట్లాడి గ్రంథాలయాల సమస్యలను పరిష్కరిస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా వెల్లడించారు. మంగళవారం పండితాపురం,కామేపల్లి గ్రంథాలయాలను ఆయన సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పండితాపురం గ్రంథాలయ భవనం పురాతన కాలం నుండి కొనసాగుతుందని శిథిలావస్థకు చేరుకుందని కూలిపోయే ప్రమాదం ఉందని కొమ్మినేపల్లి గ్రామ సర్పంచ్ అనురాధ, ఉపసర్పంచ్ మల్లికార్జున్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి శంకర్ గ్రామ పెద్దలు వెంకటేశ్వర్లు, ప్రసాద్,మల్లయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వినతి పత్రం అందజేశారు.ఈ గ్రంథాలయాన్ని అప్పుడు దాకా ప్రాథమిక పాఠశాలలో నిర్వహించాలని వారు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకోవడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కామేపల్లి గ్రంథాలయం సమస్యలు కూడా పరిష్కరిస్తానని వెల్లడించారు ఈ కార్యక్రమంలో ఇన్చార్జి గ్రంథ పాలకుడు ఎం నవీన్ కుమార్ ప్రజలు,పాఠకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కవి బుక్కా సత్యనారాయణకు ఘన సత్కారం

**ఖమ్మం, ఆగస్టు 4 ( జనంసాక్షి )**







బయ్యారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1976-77 విద్యా సంవత్సరానికి చెందిన ,పదో తరగతి పూర్వ విద్యార్థులు కలిసి పరస్పరం ఆత్మీయంగా పలకరించుకొని గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. దాదాపు 50 ఏళ్ల తర్వాత వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన అలనాటి విద్యార్థులు ,ఒకే చోట చేరి ఆనందంగా గడిపారు. ఈ ఆనంద సమయంలో తమ తోటి సహచరుడుబుక్కా సత్యనారాయణ సాహిత్యంలో ,ప్రముఖ పాత్ర పోషిస్తూ, రెండు తెలుగు రాష్ట్రాలలో, సాహిత్య సేవలను కొనసాగిస్తున్న, సందర్భంలో వారికి న్యూఢిల్లీలో డాక్టరేట్ ప్రధానం, నంది అవార్డు ప్రధానం, వికాస వేదిక సాహిత్య సంస్థ రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా తెలంగాణ ఉద్యమకారుడిగా ఎన్నో సంఘాలకు సేవలు అందిస్తూ, రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులచే పురస్కారాలు, జాతీయ అంతర్జాతీయ పురస్కారాలు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు మాజీ గవర్నర్లు, జిల్లా కలెక్టర్లు, వివిధ ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా సుమారు 60 పురస్కారాలు అందుకున్న సందర్భంగా సామాజిక సేవలు, అన్నదానాలు, బాధితులకు సేవలు, పేదవారికి తోచినంత సహాయం, తోటి కవులకు పుస్తకాల ముద్రణలో సహాయ సహకారాలు, ఎన్నో ఘనమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంగా వారిని దంపతులతో ఘనంగా ఆత్మీయ సమ్మేళనంలో సత్కరించుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో కొల్లా మన్మధరావు, ఎర్ర నాగేశ్వరరావు, మట్టి వెంకటేశ్వర్లు ,ఆర్ వీరభద్రం ,ఎండి యూసఫ్, యలమర్తి వెంకటేశ్వర్లు, బుక్కా సత్యనారాయణ, మొగిలిచర్ల వెంకటేశ్వర్లు ,జి వీరభద్రం ,వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు, ఎన్ ప్రసాద్, ఎస్ వెంకటేశ్వరరావు, కాజా రమణ, తాటికొండ లీల, ఎం పద్మప్రియ ,పద్మజ, వాసిరెడ్డి సులోచన, సున్న పావని, పుట్టగుంట సత్యనారాయణ, వేములపల్లి స్వరూప, తదితరులు పాల్గొన్నారు.



## మోక్షజ్ఞ ఉన్నత చదువులకు రూ.10 వేల ఆర్థిక సాయం

**- పేద విద్యార్థికి చేయూతనందించిన శనగ నాగయ్య, స్నేహితులు..**

**బూర్గంపహాడ్ ఆగస్టు 04 (జనంసాక్షి)**

పేదరికం ప్రతిభకు అడ్డుకాదని చాటిచెబుతూ బూర్గంపహాడ్ మండలం మొరంపల్లి బంజర గ్రామానికి చెందిన చందా మోక్షజ్ఞ ఉన్నత విద్యాభ్యాసానికి గ్రామానికి చెందిన శనగ నాగయ్య తన స్నేహితులు జయప్రకాశ్, కెనడీ, జయరావు, సైమన్ సహకారంతో రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇటీవల ఐఐటీ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన మోక్షజ్ఞకు తొలి సెమిస్టర్ హాస్టల్ ఫీజు కోసం రూ. 60 వేల అవసరం ఏర్పడింది. తండ్రి చందా మౌలాలి మృతి అనంతరం కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, మోక్షజ్ఞ చదువుపై పట్టుదలతో ముందుకు సాగుతున్నాడు. ఈ సందర్భంగా శనగ నాగయ్య మాట్లాడుతూ, ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు సమాజంలోని దాతలు అండగా నిలవాలని, మోక్షజ్ఞ విద్యాభ్యాసానికి భవిష్యత్తులోనూ తమ వంతు సహాయం కొనసాగిస్తామని తెలిపారు. శనగ నాగయ్య, ఆయన స్నేహితుల సేవాభావాన్ని గ్రామస్థులు అభినందిస్తూ, మోక్షజ్ఞ ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు.

## అశ్వాపురం పౌర సరఫరాల గోదాము సమస్యలు పరిష్కరించాలి

**కలెక్టర్‌కు మాలమహానాడు జిల్లా కార్యదర్శి కాలువ సంసాన్ వినతి**

**అశ్వాపురం, ఆగస్టు 4 (జనంసాక్షి):**

అశ్వాపురం మండల కేంద్రంలోని పౌర సరఫరాల గోదాము వద్ద వర్షపు నీరు నిలిచిపోవడంతో బియ్యం నిల్వలు దెబ్బతింటున్నాయని, హమాలీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాలమహానాడు జిల్లా కార్యదర్శి కాలువ సంసాన్ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.ఇటీవల గోదాము ముందు రహదారిని ఎత్తు చేయడంతో గోదాము ప్రాంగణం పల్లంగా మారి, వర్షపు నీరు లోపలికి చేరి బియ్యం బస్తాలు తడుస్తున్నాయని పేర్కొన్నారు. బురద కారణంగా కార్మికులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడిందని, రేషన్ బియ్యం కోసం వచ్చే ప్రజలు, డీలర్లు కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.గోదాము ప్రాంగణంలోకి నీరు రాకుండా డ్రైనేజీ ఏర్పాటు చేయడంతో పాటు ప్రాంగణాన్ని ఎత్తు చేసి కాంక్రీట్ ఫ్లోరింగ్ నిర్మించాలని, ప్రభుత్వ ధాన్యం, కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కాలువ సంసాన్ కోరారు.

## ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా గుగులోతు రాజారాం ఏకగ్రీవ ఎన్నిక

**తుంగతుర్తి, ఆగస్టు 4,(జనంసాక్షి)**



ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా మండల పరిధిలోని రావులపల్లి తండాకు చెందిన గుగులోతు రాజారాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా మూడో మహాసభ లో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాజారాం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జిల్లాలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాజారాం ఎన్నిక పట్ల తుంగతుర్తి నియోజకవర్గ ఏఐటీయూసీ నాయకులు శ్యాంసుందర్, కోట రామస్వామి, పాల్వాయి పున్నయ్య, గూడ నరసయ్య, నజీర్ తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో కార్మికుల హక్కుల సాధన కోసం ఆయన సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

# భద్రాచలంలో బెల్టు షాపుల దందా జోరు

- ఆలయ పరిసరాలు, విద్యాసంస్థల వద్ద యథేచ్ఛగా మద్యం విక్రయాలు.
- ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం..




**భద్రాచలం ఆగస్టు 04 (జనంసాక్షి)**
పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలం పట్టణంలో అక్రమ బెల్టు షాపుల నిర్వహణ రోజురోజుకూ పెరుగుతుండటంపై స్థానికులు, భక్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సిండికేట్ ఆధ్వర్యంలో బెల్టు షాపులు యథేచ్ఛగా నడుస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి వెళ్లే మార్గాలు, ఆలయ పరిసర ప్రాంతాల్లో మద్యం విక్రయాలు సాగుతుండటంతో భక్తులు, పర్యాటకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. మూడు నెలల క్రితం గ్రామపంచాయతీ బెల్టు షాపుల నిర్మూలనకు తీర్మానం చేసినప్పటికీ, రాజకీయ జోక్యంతో అది అమలుకు నోచుకోలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రామాలయం వసతి గృహాల సమీపం, గ్రామపంచాయతీ కార్యాలయం పక్కన, ఐటీడీఏ పరిసరాలు, ట్రైబల్ మ్యూజియం, కాలేజ్ గ్రౌండ్, శివాలయం, అంబేద్కర్ సెంటర్, చర్ల రోడ్, బస్టాండ్, పాత మార్కెట్, కాలేజీ సెంటర్ తదితర ప్రాంతాల్లో బెల్టు షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. అక్రమ మద్యం విక్రయాలను నియంత్రించడం లో ఎక్సైజ్ శాఖ పూర్తిగా విఫలమైందని స్థానికులు మండి పడుతున్నారు. గతంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదని పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో మద్యం మత్తులో తిరిగే వ్యక్తుల కారణంగా శాంతిభద్రతలకు భంగం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఎమ్మార్పీ ధరలకు విక్రయించాల్సిన మద్యం సీసాలను బెల్టు షాపులకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని మద్యం వినియోగదారులు ఆరోపిస్తున్నారు. అలాగే పట్టణ శివార్లలో ఫ్యామిలీ రెస్టారెంట్ పేరుతో నడుస్తున్న కొన్ని కేంద్రాల్లోనూ అక్రమంగా మద్యం విక్రయాలు సాగుతున్నాయని చెబుతున్నారు. ఈ పరిస్థితులు రోడ్డు ప్రమాదాలకు కూడా కారణమవుతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. భద్రాద్రి పుణ్యక్షేత్ర ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్న అక్రమ బెల్టు షాపులపై ఎక్సైజ్ శాఖ, పోలీసు అధికారులు సంయుక్తంగా ప్రత్యేక చర్యలు చేపట్టి కఠినంగా అరికట్టాలని స్థానిక ప్రజలు, భక్తులు, పర్యాటకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



## బీఆర్ఎస్ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

**ఖమ్మం, ఆగస్టు 4 (జనంసాక్షి):**
బీఆర్ఎస్ నాయకులపై సోషల్ మీడియాలో అసభ్యకర, అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని పార్టీ టౌన్ నాయకుడు సురేష్ హెచ్చరించారు. ఖమ్మంలోని గోపాలపురంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్, పువ్వాడ అజయ్ కుమార్, తాతా మధు, నామా నాగేశ్వరరావు తదితర నాయకులను లక్ష్యంగా చేసుకుని ఒక వ్యక్తి సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాడని ఆరోపించారు. ప్రజల్లో ఎలాంటి గుర్తింపు లేని వ్యక్తి పార్టీ నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదన్నారు. పువ్వాడ అజయ్ కుమార్ జిల్లాకు సేవలందించిన నాయకుడని పేర్కొంటూ, ఆయనపై అసత్య ఆరోపణలు చేస్తే తీవ్రంగా ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు.

**పువ్వాడ కుటుంబంపై వ్యాఖ్యలు ఖండనీయం**
బీఆర్ఎస్ టౌన్ బీసీ నాయకుడు వీరేందర్ గౌడ్ మాట్లాడుతూ, పువ్వాడ కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నాలుగు దశాబ్దాల రాజకీయ చరిత్ర కలిగిన కుటుంబంపై ఆధారరహిత ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పార్టీ నాయకులను ఉద్దేశించి మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలకు పాల్పడకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నగర ఎస్టీ సెల్ నాయకుడు వాంకుడోత్ సురేష్ నాయక్, నగర నాయకులు కందాల వీరేందర్ గౌడ్, వద్రనపు శ్రీనివాస్, పమ్మి రమేష్, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, షేక్ పాషా, పరిమళ ప్రవీణ్, గండమాల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి లేబర్ కోడ్లు రద్దు చేయాలి



**చంద్రుగొండ, ఆగస్టు 4 (జనం సాక్షి):**
కార్మిక చట్టాలను పునరుద్ధరించి, లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ఈ నెల 10న నిర్వహించే జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు రుక్మిణి పిలుపునిచ్చారు. మంగళవారం చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ, కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను కేంద్ర ప్రభుత్వం పెట్టుబడదారులకు అనుకూలంగా మారుస్తోందని విమర్శించారు. ఆశ వర్కర్లను స్కీమ్ వర్కర్లుగా కాకుండా కార్మికులుగా గుర్తించి నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ సమస్యలను వివరిస్తూ రూపొందించిన వినతిపత్రాన్ని వైద్యాధికారి రమేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు రమాదేవి, రాజేశ్వరి, కుమారి, అరుణ, జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## వ్యాపార లైసెన్సులు, పరిశుభ్రతపై గొందిగూడెంలో అవగాహన సమావేశం

### తడి-పొడి చెత్త వేరు చేయాలని సర్పంచ్ తాటి వెంకటలక్ష్మి పిలుపు

**అశ్వాపురం, ఆగస్టు 4 (జనంసాక్షి):**
గొందిగూడెం గ్రామపంచాయతీలో సర్పంచ్ తాటి వెంకటలక్ష్మి ఆదేశాల మేరకు గ్రామంలోని కిరాణా, చికెన్ షాపులు తదితర వ్యాపార సంస్థల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ నిబంధనల ప్రకారం వ్యాపార లైసెన్సులు తీసుకోవడం, పరిశుభ్రత పాటించడం, షాపులను నిర్ణీత సమయాల్లో నిర్వహించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో తడి చెత్త?పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయంగా నిర్వహించాల్సిన అవసరంపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ గ్రామపంచాయతీకి సహకరించాలని సర్పంచ్ తాటి వెంకటలక్ష్మి విజ్ఞప్తి చేశారు.

## దోసపహాడ్ నుంచి సూర్యాపేటకు ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా



**సూర్యాపేట, ఆగస్టు 4 (జనం సాక్షి):**
సూర్యాపేట పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం దోసపహాడ్ నుంచి ప్రత్యామ్నాయ నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది చర్యలు చేపట్టారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్. హన్మంతరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ కె. వెంకటేశ్వర్లుతో కలిసి దోసపహాడ్ పంపింగ్ వ్యవస్థ, నీటి నిల్వ ట్యాంకులను పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన పాత నీటి ట్యాంకుల స్థానంలో కొత్త ట్యాంకుల నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేయాలని, అలాగే దోసపహాడ్, చౌదరి ప్లాంట్, సైనికపురి ప్లాంట్లలో మోటార్లు, పంపింగ్ లైన్లు, జనరేటర్లు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాలో అంతరాయాలు, భూగర్భ జలాల తగ్గుదల నేపథ్యంలో దోసపహాడ్ నుంచి ప్రత్యామ్నాయ నీటి సరఫరాను పునరుద్ధరించి పట్టణ ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ నివేదిత లక్షాది తెలిపారు.

## మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు తుది దశకు

- బాహుబలి మోటార్ అమరికకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శ్రీకారం..
- రైతులకు శాశ్వత సాగునీటి భరోసా. చివరి ఎకరం వరకు నీరందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..



**అశ్వాపురం ఆగస్ట్ 4 (జనంసాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని సీతారామపురం వద్ద నిర్మితమవుతున్న మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ప్రాజెక్టులో అత్యంత కీలకమైన బాహుబలి మోటార్ అమరిక పనులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పూర్తయిన అనంతరం ఈ ప్రాంత రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతు అభివృద్ధి ద్వారానే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందించి అశ్వాపురం మండలాన్ని సస్యశ్యామలం చేస్తామని, రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. రాజీవ్ సాగర్ ప్రాజెక్టు ప్రారంభ సమయంలో ఎమ్మెల్యేగా ఉండడం, నేడు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పూర్తి దశకు చేరుకున్న సందర్భంలో కూడా ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. లెఫ్ట్ కెనాల్ ద్వారా ఆరు గ్రామపంచాయతీల పరిధిలోని సుమారు 12 వేలకుపైగా ఎకరాలకు, రైట్ కెనాల్ ద్వారా 10 చెరువులను నింపి దాదాపు 30 వేల ఎకరాలకు చివరి ఎకరం వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ టి. వెంకటేశ్వరరావు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ కె. శ్రీనివాస్, సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఎంఈఐఎల్ సిబ్బంది, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, గాదె కేశవరెడ్డి, ఆవుల రవి, వేములపల్లి రమేష్, ఉసా అనిల్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భూరెడ్డి వెంకటరెడ్డి, తుక్కాని మధు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు మరియు అధికారులు పాల్గొన్నారు.

# సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో పాడిపంటల్లో అభివృద్ధి సాధించాలి

## బంజారా సోదర సోదరీమణులకు తీజ్ శుభాకాంక్షలు చెప్పిన కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి



**చుంచుపల్లి జనంసాక్షి 4 ఆగస్టు**
చిట్టిరామవరం తండాలో తీజ్ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం జరిగిన ముగింపు వేడుకలకు కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బానోత్ భీమా నాయక్ వారి మండపం వద్ద సేవాలాల్ మహారాజ్, మేరమ్మ భవానీలకు ప్రత్యేక పూజలు చేశారు. 9 రోజులపాటు కన్నెపిల్లలు కఠోర దీక్షతో పెంచిన తీజ్ ను స్వీకరించి వారికి కానుకలు ఇచ్చారు. అనంతరం వారితో కలిసి సంప్రదాయం లంబాడీ నృత్యం చేశారు. సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో పాడిపంటల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. తీజ్ లో ఉన్న పచ్చదనం వారి జీవితాల్లో ఉండాలని, తీజ్ పండుగ శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సాగర్ మల్హోత్ర, లచ్చిరాం, సాంగు, లకావత్ శంకర్, పూర్ణ, మనోజ్, హరి బానోత్, కన్ని, ఖాజా భక్ష్, కాపు జినీత్, అనిల్ నాయక్, యుగంధర్, వేణు, సమీర్, సోహెబ్, విఘ్నేష్, మహిళలు ద్వాలి, హీరమణి, వెన్నెల, కోమలి, సింధు, కాత్యాయని, అర్చన, శ్రీకారుణ్య తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్లు రద్దు చేసి కార్మిక చట్టాలు పునరుద్ధరించాలి

- ఆశ వర్కర్లకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలి
- ఆగస్టు 10 జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 4 (జనంసాక్షి)**
కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేసి, కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని ఆశ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు కాక విజయ డిమాండ్ చేశారు. ఈ నెల 10న నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె ఆశ వర్కర్లకు పిలుపునిచ్చారు. మంగళవారం ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో నిర్వహించిన ఆశ వర్కర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మిక వర్గం దశాబ్దాల పోరాటాలతో సాధించుకున్న హక్కులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చిందని విమర్శించారు. లేబర్ కోడ్ల అమలుతో కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమం దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశ వర్కర్లను స్కీమ్ వర్కర్లుగా కాకుండా కార్మికులుగా గుర్తించి నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని, ఎనిమిది గంటల పనిదినాన్ని అమలు చేయాలని, లేబర్ కోడ్లను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆశ వర్కర్లు తమ సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వైద్యాధికారి నజ్ నిన్ తబసుమ్కు అందజేశారు. ఈ సమావేశంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు ముంతాజ్, సీత, ప్రియాంక, వెంకటలక్ష్మి, నాగమణి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లు అప్రమత్తంగా ఉండాలి

❑ అభ్యంతరకర పోస్టులు వెంటనే తొలగించాలి ❑చట్టవిరుద్ధ పోస్టులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు ❑విద్వేషపూరిత, అసభ్యకర పోస్టులు షేర్ చేసే సభ్యులను వెంటనే గ్రూపు నుంచి తొలగించాలి ❑సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని ప్రజలకు సీఐ ఎల్లయ్య సూచన




**అశ్వాపురం, ఆగస్టు 4 (జనంసాక్షి):**
వాట్సాప్ గ్రూపుల్లో సభ్యులు చేసే ప్రతి పోస్టుపై గ్రూప్ అడ్మిన్‌లు అప్రమత్తంగా ఉండాలని అశ్వాపురం సీఐ సిహెచ్ ఎల్లయ్య సూచించారు. గ్రూపులో ఎవరైనా సభ్యులు అభ్యంతరకరమైన, అసభ్యకరమైన, విద్వేషపూరితమైన లేదా చట్టవిరుద్ధమైన పోస్టులు, సందేశాలు, ఫోటోలు, వీడియోలు షేర్ చేసినట్లయితే వాటిని వెంటనే తొలగించే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అటువంటి పోస్టులు చేసే సభ్యులను వెంటనే గ్రూపు నుంచి తొలగించాలని, అవసర మైతే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని గ్రూప్ అడ్మిన్‌లకు సూచించారు. సోషల్ మీడియా వేదికలను బాధ్యతాయుతంగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చట్టాన్ని ఉల్లంఘించే పోస్టులు సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రజలు సోషల్ మీడియాలో ఏ సమాచారం అయినా షేర్ చేసే ముందు దాని నిజానిజాలను నిర్ధారించుకోవాలని సీఐ ఎల్లయ్య సూచించారు. పుకార్లు, అసత్య ప్రచారం, మత, కుల విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు, రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని కోరారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలను ప్రోత్సహించే లేదా అభ్యంతరకర పోస్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, నిబంధనలు ఉల్లంఘించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. "సోషల్ మీడియా ప్రజలకు ఉపయోగపడే వేదిక కావాలి. అపోహలు, అసత్య ప్రచారం, అభ్యంతరకర పోస్టులకు కాదు" అని సీఐ ఎల్లయ్య స్పష్టం చేశారు.

# వసుధ ఫౌండేషన్ సేవలు శ్లాఘనీయం డిఎస్పి అరుణ్ కుమార్




**భద్రాచలం ఆగస్టు 04 (జనంసాక్షి)**
ఏజెన్సీ ప్రాంతంలో వసుధ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు శ్లాఘనీయమని భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్ అన్నారు. గుండె సమస్యతో బాధపడుతున్న భద్రాచలంకి చెందిన ఎం విజయ్ వైద్య చికిత్స కోసం వసుధ ఫౌండేషన్ ఆర్థిక చేయూత అందించింది. గుండె సంబంధించిన సమస్యతో బాధపడుతున్న విజయ్ కు ఆర్థిక చేయూత అందించాలని వారి కుటుంబ సభ్యులు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజును కోరారు. ఈ క్రమంలో సానుకూలంగా స్పందించిన ఆయన వసుధ ఫౌండేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజును ఆర్థిక సాయం అందించాలని సూచించారు. ఈ నేపద్యం లో భద్రాచలం డి.ఎస్.పి అరుణ్ కుమార్ చేతుల మీదుగా రూ.10 వేల చెక్కును అందజేశారు. ఈ సమయంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని నిరుపేదలకు విద్యా వైద్య రంగాల్లో వసుధ అందిస్తున్న సేవలు అమూల్యమైనవన్నారు.

# ఆగస్టు 10న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి

**మోటకొండూరు, ఆగస్టు 4(జనం సాక్షి):-**

క్విట్ ఇండియా స్ఫూర్తితో నిర్వహించే 'జైల్ భరో' కార్యక్రమంలో రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, రైతు–కార్మిక వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ కల్పించి రైతుల హక్కులను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్



# తల్లిపాలే బిడ్డలకు తొలి రక్షణ పోషణ

## జిల్లా మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్ట్ అధికారి ప్రమీల





**కామేపల్లి,ఆగస్టు 4 (జనం సాక్షి):**
తల్లిపాలే బిడ్డలకు తొలి రక్షణ పోషణ అని జిల్లా మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్టు అధికారిణీ ఏ ప్రమీల తెలిపారు. మండలంలోని పండితాపురం రైతు వేదికలో ఐసిడిఎస్ కామేపల్లి ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సభలో ఆమె మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు అమ్మ పాలు అమృతం అని అన్నారు. బిడ్డలు పుట్టగానే ప్రతి అమ్మ అందించే మొదటి పౌష్టిక ఆహారం ముర్రు పాలేనని ఆ పాలను పుట్టిన ప్రతి బిడ్డకు తాగించాలని కోరారు. బిడ్డలకు ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టించాలని తద్వారా వ్యాధి నిరోధక శక్తి, పెరుగుతుందని తెలిపారు. బిడ్డలకు వయస్సుకు తగిన ఆహారం ఇవ్వడం తోపాటు రెండేళ్లపాటు తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారని వివరించారు. తల్లిపాల వారోత్సవాలు అధికారిక కార్యక్రమంగా కాకుండా ప్రజల్లో చైతన్య కలిగించే విధంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అన్ని అంగన్వాడి కేంద్రాలతో పాటు ఆరోగ్య కేంద్రాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించొచ్చని అన్నారు. ఈ సభలో కామేపల్లి ప్రాజెక్టు సిడి పిఓ కే ఉమా,మండల వైద్య అధికారిణి డాక్టర్ శ్రీదేవి, కొమ్మినేపల్లి సర్పంచ్ డి అనురాధ,డి ఎం కోఆర్డినేటర్ సమ్రారీన్,కామేపల్లి ప్రాజెక్ట్ సూపర్వైజర్లు టీ విజయలక్ష్మి,పీ లక్ష్మి, బి వరలక్ష్మి, ఏఎన్ఎంలు, అంగన్వాడి టీచర్లు, హెల్త్ సూపర్వైజర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరు లో ఎంపీపీ ఎస్ పాఠశాలను సందర్శించిన అడిషనల్ కలెక్టర్ శ్రీజ



**కల్లూరు ఆగస్టు 04(జనం సాక్షి)**
కల్లూరు పట్టణంలోని ఎంపీపీ ఎస్ పాఠశాలను స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శ్రీజ, మంగళవారం సందర్శించారు. అదేవిధంగా ఇటీవల ప్రభుత్వం పరంగా ఏర్పాటు చేసిన ఫ్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పూర్వ ప్రాథమిక విద్యార్థుల నమోదు,విద్యార్థి,ఉపాధ్యాయుల ఎఫ్ ఆర్ ఎస్ హాజరు, పాఠశాలలో భోదనాభ్యసన కృత్యములు, అల్పాహారం,మధ్యాహ్నభోజన నిర్వహణ తదితర అంశాలు పరిశీలించారు. పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అల్పాహారం మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో తయారుచేసి సకాలంలో వడ్డించాలని సూచించారు. ఫ్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ అమల్లో భాగంగా చిన్నారుల అడ్మిషన్స్ పెంపొందించాలని సంబంధిత పాఠశాల హెచ్ఎం, ఇన్స్ట్రక్టర్ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారిణి పొదిలి పద్మ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్కా రామారావు , పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేరువంచ జడ్పీ హైస్కూల్‌లో కోలాహలంగా అల్పాహార పథకం ప్రారంభం

**కల్లూరు ఆగస్టు 04(జనంసాక్షి)**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉదయకాలపు అల్పాహార పథకం పేరువంచ జడ్పీ ఉన్నత పాఠశాలలో కోలాహలంగా ప్రారంభమైంది. గ్రామ సర్పంచ్ కీసర నిర్మల మోహన్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులకు అల్పాహారం నేతి ఉప్మా, చట్నీ, పాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కీసర నిర్మల మోహన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల శారీరక, మానసిక వికాసాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహార పథకం ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ పథకం ద్వారా విద్యార్థుల హాజరు శాతం పెరగడంతో పాటు,ఆలస్యంగా పాఠశాలకు వచ్చే వారి సంఖ్య కూడా తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు విద్యార్థులకు అందించిన అల్పాహారాన్ని రుచి చూసి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు .ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ మౌలాలి మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రతి విద్యార్థి వాటి ప్రయోజనాలను పొందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రాజు, యువ నాయకులు పరిమి భరత్, పాశం శ్రీను, జె. గోపాలరావు, మంచాల మాధవరావు, కోట ఉపేంద్ర, కొండపల్లి వంశీ,ఇనపాల రవీంద్ర,ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థుల అభ్యసనపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**చంద్రుగొండ, ఆగస్టు 4 (జనం సాక్షి):**
మండలంలోని అయ్యన్నపాలెం ప్రధానోన్నత ప్రాథమిక పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖ ప్రణాళిక సమన్వయకర్త సతీష్, సముదాయ ప్రధానోపాధ్యాయుడు ఉప్పల్ రెడ్డితో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించారు. పాఠశాలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి వివరాలు విద్యార్థుల సమాచార నమోదులో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. అలాగే ప్రతి విద్యార్థికి అపార్ గుర్తింపు సంఖ్య, ఆధార్ వివరాలు తప్పనిసరిగా ఉండేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఆదర్శ పాఠశాల కార్యక్రమానికి సంబంధించిన అన్ని వివరాలు, పాఠశాల రికార్డులు ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం నైపుణ్యాలు సంపూర్ణంగా వచ్చేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్పి సేవ్యా పాల్గొన్నారు.



## రేపటి నుండి ఉచిత యోగ శిక్షణా తరగతులు

**చిట్యాల, ఆగస్టు 03 (జనంసాక్షి ):**
చిట్యాల లో ఆగస్టు 6వ తేదీ నుండి సంకల్ప క్రియ యోగ ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించబడునని సంకల్ప క్రియా సాధకులు బూరుగు కృష్ణయ్య, కంచర్ల ఈశ్వరయ్య,కాచం రమేష్ తెలిపారు. చిట్యాల లోని ధ్యాన మందిరం లో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. యోగాసనాలతో అనారోగ్యా సమస్యలు తొలగి మార్పులతో ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. స్థానిక భువనగిరి రోడ్ లోని లక్ష్మి గార్డెన్స్ ఫంక్షన్ హాల్ 6 వ తేది సాయంకాలం 6గంటలకు పరిచయ కార్యక్రమం తో శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయన్నారు, మరుసటి రోజు నుండి ఉదయం 5 గంటల నుండి 7 వరకు, సాయంకాలం 6 గంటల నుండి 8 గంటల వరకు ఉచిత యోగ శిక్షణ జరునని తెలిపారు. శిక్షణ కు ప్రతి ఒక్కరు హాజరై ఆరోగ్యావంతులుగా కావడం, ఆరోగ్యం ను మెరుగుపరచుకోవాలన్నారు. కార్యక్రమం లో రేగొండ వేణుమాధవ్, మాస శ్రీనివాస్, గాదె ఎల్లేష్, నీలా సత్యనారాయణ, పోలా సరోజ సాధకులు పాల్గొన్నారు.



## గ్రామాభివృద్ధి ప్రణాళికకు గ్రామసభ ఆమోదం ?

### పోడు భూములకు ఎరువులు అందించాలని రైతుల వినతి

**చంద్రుగొండ, ఆగస్టు 4 (జనం సాక్షి):**
మండలంలోని బెండాలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామాభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బొర్రా లలిత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు విస్తృతంగా చర్చించి అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. గ్రామసభ అనంతరం వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సహజ వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారి రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదే విధంగా పోడు భూములకు ఎరువులు అందించాలని కోరుతూ పోడు రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రోహిత్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దిశ కమిటీ సభ్యుడు బొర్రా సురేష్, ఉప సర్పంచ్ బానోవత్ బాలు, వార్డు సభ్యులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## దండు మల్కాపురంలో గ్రామసభ రసాభాస

◆సెక్రటరీ వైఖరిపై గ్రామస్తుల ఆగ్రహం, సభ బహిష్కరణ

◆రూ.54 లక్షల నిధుల గోల్‌మాల్‌పై నిలదీత

◆కలెక్టర్, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని సర్పంచ్ ఆరోపణ

**చౌటుప్పల్ ఆగస్టు 4(జనంసాక్షి)**
మండల మండల పరిధిలోని దండు మల్కాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభ ఉద్రిక్తతకు దారితీసింది. పంచాయతీ నిధుల అవకతవకలపై గ్రామ కార్యదర్శి సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్తులు గ్రామసభను బహిష్కరించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం ముందు సెక్రటరీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రమాదేవి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రస్తుత పాలకవర్గం ఏర్పడక ముందు ప్రత్యేక అధికారి పాలనలో దండు మల్కాపురం గ్రామపంచాయతీలో సుమారు రూ.1.20 కోట్లకు పైగా నిధుల అక్రమాలు జరిగాయని గ్రామస్తులు ఆరోపించారు. అందులో కొంతమొత్తం రికవరీ అయినప్పటికీ, ఇంకా రూ. 54 లక్షలకు సంబంధించిన వివరాలు లభ్యం కాలేదు. దీనిపై గత నాలుగు నెలలుగా సెక్రెటరీ ని వివరణ కోరుతున్నా ఎలాంటి సమాధానం ఇవ్వడం లేదని గ్రామస్తులు మండిపడ్డారు. గ్రామసభలోనూ ఆమె స్పష్టత ఇవ్వకపోవడంతో సభ నుంచి బయటకు వచ్చి నిరసన తెలిపినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ సెక్రటరీ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్‌ను కావడం వల్లే గ్రామంలో అభివృద్ధిని, నిధుల వినియోగాన్ని అడ్డుకునేలా సెక్రటరీ ప్రవర్తిస్తున్నారన్నారు. సర్పంచుల శిక్షణ పూర్తయిన తర్వాత పంచాయతీకి సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు ఇవ్వాలని కోరగా... అధికార పార్టీ నాయకుల అండదండలతో ఆ సమాచారం ఇవ్వడానికి నిరాకరించారు. సర్పంచ్‌గా ఉన్న నన్నే 'సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు తీసుకోమని ఉచిత సలహాలు ఇస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన రూ. 54 లక్షల నిధుల అవకతవకలపై సెక్రటరీ స్పష్టమైన వివరణ ఇచ్చేంతవరకు గ్రామస్తులు తనను సైతం పంచాయతీ కార్యాలయంలోకి వెళ్లనివ్వడం లేదని సర్పంచ్ వెల్లడించారు. సెక్రెటరీ రమాదేవిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణలో 10 వేల మందికి ఉచిత వైద్యం

## ఖమ్మంలో 6 నెలల్లో 3,115 మంది సేవలు వినియోగం

**ఖమ్మం, ఆగస్టు 4, (జనంసాక్షి) :**
స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న 'ఆరోగ్య సేవ కేంద్రాలు' తెలంగాణలో ప్రజలకు ఉచిత ప్రాథమిక వైద్య సేవలను అందిస్తూ విశేష ఆదరణ పొందుతున్నాయి. రాష్ట్రంలోని ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 10 వేల మందికి పైగా లబ్ధిదారులు ఉచిత వైద్య సేవలు పొందినట్లు సంస్థ వెల్లడించింది. ఖమ్మం నగరంలోని నిజాంపేట్, యాదవ్ బజార్‌లో ఏర్పాటు చేసిన ఆరోగ్య సేవ కేంద్రాన్ని ప్రారంభించి కేవలం ఆరు నెలలే అయినప్పటికీ 3,115కు పైగా లబ్ధిదారుల సందర్శనలు నమోదయ్యాయి. ఈ కేంద్రంలో ఎంబీబీఎస్ వైద్యుడి సేవలు, బ్లడ్ షుగర్, హిమోగ్లోబిన్, మూత్ర పరీక్షలు, మలేరియా ర్యాపిడ్ టెస్ట్‌లు, ఉచిత మందులు, ఆరోగ్య సలహాలు, అర్హులకు న్యుమోకోకల్ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందిస్తున్నారు. ఈ కేంద్రానికి వచ్చే వారిలో ప్రధానంగా మధుమేహం, అధిక రక్తపోటు, జ్వరం, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నవారే ఎక్కువగా ఉన్నట్లు సంస్థ తెలిపింది. ఇంటికి సమీపంలోనే ఉచిత ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో ప్రజలు ఈ సేవలను అధికంగా వినియోగిస్తున్నారని పేర్కొంది. స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ బిజినెస్ హెడ్ శ్రీనివాస్ కేబీబీ మాట్లాడుతూ, "ప్రజలకు సమీపం లోనే ప్రాథమిక వైద్య సేవలు అందించడం ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించవచ్చు. అదే లక్ష్యంతో ఈ సీఎస్ఆర్ కార్యక్రమాన్ని మరింత విస్తరిస్తున్నాం" అని తెలిపారు. ఈ ఆరోగ్య సేవ కేంద్రాన్ని పిరమిల్ ఫౌండేషన్కు చెందిన పిరమిల్ స్వాస్థ్య భాగస్వామ్యం తో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం స్టార్ హెల్త్ దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల్లో 32 ఆరోగ్య సేవ కేంద్రాలను నిర్వహిస్తూ ఉచిత ప్రాథమిక ఆరోగ్య సేవలను అందిస్తోంది.






# పాఠశాలలో విద్యార్థుల పరస్పర ఘర్షణ పట్ల సమగ్ర విచారణ జరపాలి

- టేకులపల్లి ఉన్నత పాఠశాలలోని సమస్యలను పరిష్కరించాలి
- పీడిఎస్‌యు ఆధ్వర్యంలో డిఈఓ కు వినతిపత్రం



**టేకులపల్లి, ఆగస్టు 4(జనంసాక్షి):**
టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల పరస్పర ఘర్షణ, దాడి పట్ల సమగ్ర విచారణ జరపాలని, పాఠశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ అధికారి(డి.ఈ.ఓ)కు పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రణయ్ కుమార్, పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి జె. గణేష్ మాట్లాడుతూ టేకులపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత ఐదు రోజుల క్రితం 10వ, తరగతి విద్యార్థులు తరగతి గదిలో ఘర్షణకు దిగి పరస్పరం దాడి చేసుకున్నారు.ఈ సంఘటన తరగతులు జరుగు తున్న సమయంలోనే జరిగింది. విద్యార్థులే వీడియో ని తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంజరిగింది. తరగతుల నిర్వహణ సమయంలో ఇంత జరుగుతు న్న ప్రధానోపాధ్యాయుడు పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరం అన్నారు. సంఘటనపై ఎలాంటి విచారణ, వివరణ లేకుండానే ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులకు టి.సి లు ఇచ్చి చేతులు దులుపుకు న్నాడని, ఇంతటి తీవ్రమైన ఘటన జరిగినప్పటికీ మండల విద్యాశాఖ అధికారి (ఎం.ఈ.ఓ) నేటి వరకు కనీసం స్పందించలేదని, పైగా విషయాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని, ఉపాధ్యాయుల పరువు పోతుందని కప్పి పుచ్చడం పట్ల పలు అనుమానాలకు తావిస్తుందని ఆరోపించారు. పాఠశాల నిర్వహణ,విద్యార్థుల,తన విధి నిర్వహణ పట్ల ప్రధానోపాధ్యాయుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నాడు అనేది ఈ సంఘటన ద్వారా అర్థం అవుతున్నట్లుగా కనిపిస్తుందని విమర్శించారు.. పాఠశాలలో విద్యార్థులు గ్రూపులుగా విడివడి దాడి చేసుకోవడం వాటిని వీడియోలు తీయడం కానీ అటువంటిది పాఠశాల వాతావరణం కలుషితమైన దనేది స్పష్టం అవుతున్నది. అంతే కాకుండా తెలుగు ఉపాధ్యాయురాలు, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయు డు విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ తరగతి గదిలో విద్యార్థులపై దుర్భాషలాడుతున్నారని విద్యార్థులు తెలుపుతున్నారన్నారు. పాఠశాల టీచర్ల మధ్య అనేక వివాదాలు ఉన్నాయనేది కూడా చర్చ నియాంశంగా ఉన్నది. వారి వివాదాల మూలంగానే కొందరి విద్యార్థులకు వెనకాల నుండి సపోర్ట్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, ఉపాధ్యాయుల అంతర్గత వివాదాలే విద్యార్థుల పట్ల బహిర్గతమవుతున్నాయని, వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనంలో పూర్తిగా నాణ్యత లోపించింది. నీళ్ల వంటి చారు, పురుగుల అన్నం విద్యార్థులకు పడ్డిస్తున్నారు. బాలులకు మరుగుదొడ్లు లేవు, బాలికలకు సరిపడా మరుగుదొడ్లు లేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా భోజనం టైం లో విద్యార్థులు గ్రౌండ్లో ఎండలో నిలబడి తినాల్సిన పరిస్థితి ఉందని, ఆర్వో వాటర్ ప్లాంట్ సరిగా పనిచేయడం లేదని,విద్యార్థుల కు తాగునీరు సమస్య ఏర్పడిందని ఇలాంటి అనేక సమస్యలు ఉన్నాయని ఇలాంటి సమస్యల వలన విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని స్కూల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యంగా విద్యార్థులకు ఘర్షణ పట్ల తక్షణమే సమగ్ర విచారణ జరిపి, విధుల నిర్వహణలో విద్యార్థుల పర్యవేక్షణ నిర్లక్ష్యం వహించిన ప్రధానోపాధ్యాయుడిపై, ఇంత జరుగుతున్నప్పటికీ పాఠశాలను సందర్శించని టేకులపల్లి మండల విద్యాశాఖ అధికారిని తక్షణమే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కలుషితమైన పాఠశాల వాతావరణ తక్షణమే కాపాడాలని సంబంధిత అధికారులను వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



## స్థానిక సమస్యల పరిష్కారానికి ఉద్యమం చేపడతాం బీజేపీ భద్రాచలం మండల కమిటీ

**భద్రాచలం ఆగస్టు 04 (జనంసాక్షి)**
స్థానిక ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) భద్రాచలం మండల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించబడింది. స్థానిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుంజా ధర్మ నివాసంలో జరిగిన సమావేశానికి మండల అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, మండల ఇన్‌చార్జ్ తాటిపాముల ఐలయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.సమావేశంలో భద్రాచలం పట్టణంలోని ప్రధాన స్థానిక సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం ఉద్యమాత్మకంగా పోరాడాలని నాయకులు నిర్ణయించారు.అనంతరం బీజేపీ నాయకులు అశోక్‌నగర్ కాలనీ, బస్ స్టేషన్ ఎదురుగా ఉన్న మెడిలైఫ్ ఆసుపత్రి పరిసర ప్రాంతాలను సందర్శించి దెబ్బతిన్న రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, సైడ్ కాలువల పరిస్థితిని పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో తక్షణమే రోడ్లు, డ్రైనేజీ, సైడ్ కాలువల నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుంజా సంతోష్, ములిశెట్టి రామ్మోహన్ రావు, ఆవుల సుబ్బారావు, గోడ సత్యనారాయణ, పి.సి. కేశవ్, ముత్యాల చంద్రశేఖర్, సిహెచ్. వెంకన్న, దేవరపల్లి వెంకటేశ్వర్లు, షేర్ శ్రీనివాస్, గుమ్మాల వెంకటేశ్వర్లు, అన్నం సాయి లక్ష్మణ్, ములిశెట్టి నిఖిల్, జంపాల ప్రభాకర్, గంగులకుర్తి రామాచారి, అన్నం హరీష్, కెల్లా అప్పారావు, బి.ఎస్. నారాయణ, కే. రామలింగేశ్వరరావు, గార్లపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ ఎమ్మెల్యే

**దమ్మపేట ఆగస్టు 4 (జనంసాక్షి):**
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మంగళవారం నియోజకవర్గ పరిధిలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో వే టు న్యూస్ ఆధ్వర్యంలో నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఫోన్ ద్వారా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులను వెంటనే అప్రమత్తం చేసి సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు.ప్రజల సంక్షేమం నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## కాళ్ల నొప్పుల తైలాన్ని పొరపాటున తాగి వృద్ధుడి మృతి



**గుర్రంపోడు ఆగస్టు 04 (జనంసాక్షి)**
తేనెపల్లి గ్రామానికి చెందిన కాసర్ల బక్కయ్య (75) కాళ్ల నొప్పులకు వాడే తైలాన్ని పొరపాటున తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన విషాదాన్ని నింపింది.గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3వ తేదీ ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఇంట్లో ఉంచిన కాళ్ల నొప్పుల తైలాన్ని బక్కయ్య పొరపాటున తాగాడు. కొద్దిసేపటికే ఆయనకు తీవ్ర కడుపునొప్పి, వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 4వ తేదీ తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో బక్కయ్య మృతి చెందాడు.మృతుడి కుమారుడు కాసర్ల వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి గల పూర్తి కారణాలపై విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి గౌని నిరంజన్



**మాడుగులపల్లి, ఆగస్టు 4 (జనంసాక్షి):**
ఎమ్మెల్సీ శంకర్ నాయక్ కు రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు కల్పించాలని మాడు గులపల్లి మండల తోపుచర్ల గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌని నిరంజన్ శంకర్ నాయక్ వీరాభిమాని కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎమ్మెల్సీ శంకర్ నాయక్ అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు పార్టీకి ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం శంకర్ నాయక్‌కు తగిన గుర్తింపుగా మంత్రి పదవి ఇవ్వాలని కోరారు ఆయనకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా ఈ ప్రాంతం మరిన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.




## రాజ్యాంగం పుస్తకాల బహూకరించిన - రాయిరాల సుమన్

**చిలుకూరు, ఆగస్టు 4 (జనం సాక్షి):**
చిలుకూరు మండలంలోని బేతవోలు, చిలుకూరు, కొండాపురం, పాలెఅన్నారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలకు సామాజిక కార్యకర్త, బహుజన నాయకుడు రాయిరాల సుమన్ రాజ్యాంగ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి పాఠశాలలో రాజ్యాంగ పుస్తకం ఉండేలా చేయడం తన లక్ష్యమని, విద్యార్థులు ప్రతిరోజూ రాజ్యాంగంలోని ఒక ఆర్టికల్‌ను తెలుసుకునేలా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. రాజ్యాంగ అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని ప్రధానోపాధ్యాయులు అభినందించారు.



## మండలంలో భారీ వర్షాలు ఇండ్లలోకి నీరు

### యుద్ధ ప్రాతిపదికన సైడు డ్రైనేజీ పనులు నిర్వహించిన మర్కోడు గ్రామపంచాయతీ సర్పంచ్,ఉపసర్పంచ్

**ఆళ్లపల్లి ఆగస్టు 4(జనం సాక్షి)**
మండల కేంద్రం లో భారీ వర్షాల కారణంగా మర్కోడు గ్రామపంచాయతీలోని సైడ్ కాలువలు మూసుకుపోయి ఇండ్లలోకి భారీ వర్షపు నీరు.ఈ సందర్భంగా మర్కోడు గ్రామపంచాయతీ సర్పంచ్ సుతారి రమాదేవి,ఉపసర్పంచ్ వగలబోయిన సతీష్ మాట్లాడుతూ కట్టించిన డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా నిర్వర్యం చేస్తున్నారని డ్రైనేజీ పై మట్టి చెత్త వేస్తూ డ్రైనేజీ నుండి పోవాల్సిన నీరు పోకుండా అడ్డుకట్ట వేస్తున్నారని ఇకనుండి సహించేది లేదని ఎవరైనా డ్రైనేజీ లో చెత్త వేసిన డ్రైనేజీని నిర్వర్యం చేసిన వారిపై జరిమానాలు వేసి వెంటనే చర్య తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు భారీ వర్షం కారణంగా ఇళ్లలోని నీరు పోవడానికి యుద్ధ ప్రాతిపదికగా వెంటనే పంచాయతీ సిబ్బందితో పనులు చేయించామని తెలిపారు.



# విమాన ప్రయాణీకుల భద్రతపై ప్రశ్నించిన ఎంపీ వద్దిరాజు




**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 4 (జనంసాక్షి):** విమాన ప్రయాణికుల భద్రతపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి రాజ్యసభలో ఎంపీ పద్దిరాజు ప్రశ్నకు బదులుగా,ప్రయాణీకుల భద్రత, క్రమశిక్షణ కోసం డీజీసీఏ ప్రత్యేక మార్గదర్శకాలు ఉన్నాయని తెలిపిన విమానయాన శాఖ సహాయ మంత్రి మొహోల్ విమానాలలో క్రమశిక్షణ, ప్రయాణీకుల భద్రత,ప్రయాణీకులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ప్రశ్నించారు.ఇందుకు పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ స్పందిస్తూ..విమానాలు, ప్రయాణీకులు, ఆస్తుల భద్రతను నిర్ధారించడం, విమానాల్లో క్రమ శిక్షణ తదితర అంశాలకు సంబంధించి ప్రత్యేక విభాగాలతో పాటు స్పష్టమైన మార్గ దర్శకాలు ఉన్నాయని పేర్కొన్నారు.విమానాలలో క్రమశిక్షణ, ప్రయాణీకుల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా, అవాంఛనీయ లేదా అల్లరి ప్రవర్తనను నియంత్రించేం దుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) సివిల్ ఏవియేషన్ రిక్వైర్‌మెంట్స్, సెక్షన్–3, ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్, సిరీస్–ఎం, పార్ట్–6 కింద "హ్యాండ్లింగ్ ఆఫ్ అన్‌రూలీ, డిస్‌రప్టివ్ ప్యాసింజర్స్"పేరుతో ప్రత్యేక మార్గదర్శకాలు ఉన్నాయని ఎంపీ రవిచంద్రకు మంత్రి మొహోల్ తెలిపారు. ప్రత్యేక అవసరాలున్న ప్రయాణీకుల కోసం క్యాబిన్ సేఫ్టీ సర్క్యులర్–01/2016 ప్రకారం మార్గదర్శకాలు అమలులో ఉన్నాయని మంత్రి బదులి చ్చారు. అలాగే, ప్రయాణీకుల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించేందుకు గాను తమ శాఖ 24 గంటల "ప్యాసింజర్ అసిస్టెన్స్" కంట్రోల్ రూమ్ ను అనుసంధానం చేసి విమానాల రాకపోకల సమయం,సామాన్ల భద్రత,వాటి చేరవేతలో తలెత్తిన సమస్యలు, రీఫండ్ అంశాలను డీజీసీఏ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా విమానయాన సంస్థలతో సమన్వయం చేస్తూ పర్యవేక్షిస్తున్నట్లు ఎంపీ రవిచంద్రకు ఇచ్చిన సమాధానంలో మంత్రి వెల్లడించారు. అదనంగా, ప్రయాణీకుల ఫిర్యాదుల సత్వర పరిష్కారం కోసం ఎయిర్ సేవా పోర్టల్, మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకు రావడం జరిగిందని మంత్రి మొహోల్ ఎంపీ వద్దిరాజుకు ఇచ్చిన సమాధానంలో వివరించారు.

# కలెక్టర్ సారు జర మా రోడ్డు ఎలా ఉందో కొద్దిగా సందర్శించండి

◆కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల రెండు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్న కనుకరించని అధికారులు

◆ఎన్నిసార్లు పత్రికల్లో వచ్చిన మా మొర ఆలకించేవారు కరువైపోయారని ప్రజల ఆవేదన





**ఆళ్లపల్లి ఆగస్టు 4( జనంసాక్షి)** మండల కేంద్రంలోని బడాయికుంట, అడవిరామవరం గ్రామ ప్రజల కష్టాలు అన్ని ఇన్ని కావు.రెండు గ్రామ పంచాయతీల ప్రజలకు ఈ రోడ్డు మార్గమేనని మొత్తం బురద మయమై ఆళ్లపల్లి మండల కేంద్రానికి మర్కోడు గ్రామ పంచాయతీకి వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్న చూసి చూడనట్టుగా పోతున్నారని కాంట్రాక్టర్ సిటీ వదిలిపెట్టి మా పల్లెటూరి గ్రామాలలో బ్రతకండి అప్పుడు మీకు తెలుస్తుందని ఆగ్రహంతో ప్రజలు ఆవేదనకు గురయ్యారు రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల భయంకర బురదమయమైన మట్టి రోడ్డు పోసి ద్విచక్ర వాహనదారులకు వ్యవసాయ రైతులకు రెండు గ్రామాల ఆదివాసి గిరిజన ప్రజలు రోడ్డు కాంట్రాక్టర్ నరకం చూపిస్తున్నాడని మా రెండు గ్రామపంచాయతీలకు సాంక్షన్ అయిన రోడ్డుని వర్షాకాలం బురదమయం చేసి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాడని ప్రజలు బాధను వ్యక్తం చేస్తున్నారు రెండు గ్రామపంచాయతీ ల అధికారులు స్కూల్ టీచర్స్ సంబంధిత అధికారులకు ఈ రోడ్డు మార్గం రావాలంటే కష్టాలు ఏర్పడుతున్నాయని తెలిపారు వర్షాకాలం వస్తుందా నీకు తెలియదా అని కాంట్రాక్టర్ ఆగ్రహం వ్యక్తం ప్రజలు చేస్తున్నారు. ఉన్నత అధికారులు ఏమైపోయారని ఎక్కడ ఉన్నారని ఇప్పుడైనా తెలంగాణ ప్రభుత్వం,ఎమ్మెల్యే ఆదివాసి గిరిజన రెండు గ్రామాల ప్రజల పై చొరవ చూపాలని మొరపెట్టుకుంటున్నారు. రోడ్డు ద్వారానే మా బ్రతుకులు మాకు అనారోగ్య సమస్య ఏర్పడినప్పుడు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఈ రోడ్డు మార్గం ద్వారా మేము ఎలా పోవాలి అని ప్రజలు వాపోతున్నారు ప్రజా ప్రతినిధులు పట్టించుకోరు మండల అధికారులు పట్టించుకోరు ఈ సమస్యను ఎవరు తీర్చేది ఎవరు బాధ్యత వహించేది ఇప్పుడైనా మా ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# ఐకమత్యంతోనే జర్నలిస్టుల సమస్యలకు పరిష్కారం

## జాగు వెంకటరత్నం

**బూర్గంపహాడ్ ఆగస్టు 04 (జనంసాక్షి)**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అందరూ ఐకమత్యంతో పనిచేయాల్సిన అవసరం ఉందని టీయూడబ్ల్యూజే (ఐజేయు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు జాగు వెంకటరత్నం అన్నారు. బూర్గంపహాడ్ మండలం మోరంపల్లి బంజర్‌లోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కమిటీ తొలి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఐజేయు సంఘంపై విశ్వాసంతో అనేక మంది జర్నలిస్టులు సభ్యత్వం తీసుకున్నారని, వారి నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత జిల్లా, డివిజన్ కమిటీలపై ఉందన్నారు. పదవుల కంటే బాధ్యతాయుతమైన సేవ ముఖ్యమని, నిబద్ధతతో పనిచేసే వారికి గుర్తింపు, పదవులు వాటంతటవే వస్తాయని పేర్కొన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, పిల్లల విద్య, ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ తదితర సమస్యల పరిష్కారానికి జిల్లా నాయకత్వం స్థానిక కమిటీలతో కలిసి సమిష్టిగా కృషి చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో హెల్త్, ఎడ్యుకేషన్, ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ అంశాలపై ప్రత్యేక సబ్ కమిటీలను ఏర్పాటు చేసి సమస్యల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ నెలాఖరులోగా జిల్లా వ్యాప్తంగా ప్రధాన కేంద్రాల్లో మండల, టౌన్ కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి మండలం నుంచి నాయకత్వాన్ని తీర్చిదిద్దాలని, బలమైన సంస్థాగత నిర్మాణంతో టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లాలో మరింత బలోపేతం అవుతుందని జాగు వెంకటరత్నం ఆశాభావం వ్యక్తం చేశారు.



ఈ సమావేశంలో ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు మైదిలి రమణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేలు, జిల్లా ప్రధాన కార్యదర్శి జూనమల రమేష్, జిల్లా కోశాధికారి చీమకుర్తి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గిరిప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి నాగచంద్ర, కోశాధికారి రాజేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు శ్రీహరి, చంద్రశేఖర్, మారుతి శ్రీనివాసరావు, ప్రింట్ మీడియా పినపాక డివిజన్ అధ్యక్షుడు వెంకట్, కార్యదర్శి జోషి, ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ అధ్యక్షుడు పంపన రమేష్, కార్యవర్గ సభ్యులు శివ, నరసింహారెడ్డి, గుర్రం రవి తదితరులతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# యూరియా బుకింగ్ యాప్ రద్దు చేయాలి:సీపీఐ

## రైతులకు ఇబ్బందులు తొలగించి ఎరువులు సులభంగా అందించాలని ప్రభుత్వానికి వినతి

**సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 4 (జనం సాక్షి):**యూరియా బుకింగ్ యాప్‌ను వెంటనే రద్దు చేసి, రైతులకు ఎలాంటి కోతలు లేకుండా యూరియా, డీఏపీ ఎరువులను అందించాలని సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు వేదిక వద్ద ధర్నా నిర్వహించి వ్యవసాయ అధికారికి వినతిపత్రం సమర్పించారు. యాప్ కారణంగా గ్రామీణ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మీసేవ కేంద్రాల్లో అధిక రుసుములు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు సులభంగా ఎరువులు అందేలా బుకింగ్



విధానంలో మార్పులు చేసి, తక్కువ వర్షపాతం నేపథ్యంలో మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# కష్టకాలంలో వెంకన్నకు తోడుగా ఆటో యూనియన్

**కామేపల్లి,ఆగస్టు 4 (జనంసాక్షి):** కామేపల్లి గ్రామ నివాసి మాలపొలు వెంకన్న అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక పరిస్థితి బాగాలేక ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందు



తున్న వారిని గుర్తించి కామేపల్లి క్రాస్ రోడ్ లో నిర్మించుకున్న ఆటో డ్రైవర్ యూనియన్ సభ్యుడు అయిన మాలపోలు వెంకన్న ఆరోగ్య పరిస్థితి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వెంటనే కామేపల్లి క్రాస్ రోడ్ యందు నిర్మించుకున్న ఆటోడ్రైవర్ యూనియన్ అధ్యక్షులు కార్యదర్శులు సంఘ సభ్యులు కలిసి తమ వంతు ఖమ్మం హాస్పటల్లో ట్రీట్మెంట్ పొందుతున్న వెంకన్నకు తనకు మేమున్నామంటూ చెపుతూ మనోధైర్యాన్ని కల్పించి తమ వంతు ఆర్థిక సహాయం పదివేల రూపాయలు అందించడం జరిగింది ప్రతి మనిషికి సహాయపడాలని మానవ దృక్తులతో సమాజంలో అందరికీ మంచి మనసు ఇచ్చి ఆలోచన కలిగించాలని ఈ సందర్భంగా పుల్లయ్య గురుస్వామి తెలిపారు.